

ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రజాదర్బార్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఆగస్టు 24: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ శనివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని మంత్రి నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో మంత్రికి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్కరు సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశ్యంతో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏ ఒక్కరు సమస్యలతో బాధపడకూడదనే ముఖ్య ఉద్దేశ్యంతోనే ప్రజాదర్బార్ ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజాదర్బార్ ద్వారా స్వీకరించిన అర్జీలను అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు సుపరిపాలన అందించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు.

పక్కాగా ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్

- పైలట్ ప్రాజెక్టుగా వీరబల్లి మండలం ఎంపిక
- రాష్ట్ర భూపరిపాలనశాఖ అదనపు కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భూపరిపాలన శాఖ అదనపు కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, తదితరులు

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 24: ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ల రీవెరిఫికేషన్ ప్రక్రియ పక్కాగా ప్రభుత్వ నిబంధనల మేరకు చేయాలని రాష్ట్ర భూపరిపాలనశాఖ అదనపు కమిషనర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటికి వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వీరబల్లి మండలంలో జరుగుతున్న ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల వెరిఫికేషన్ గురించి కలెక్టర్ ఆయనకు వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వీరబల్లి మండలంలో ఫ్రీహోల్డ్‌కు సంబంధించి ఇప్పటివరకు 296 రిజిస్ట్రేషన్లపై విచారణ చేస్తున్నామని, అందులో 161 రిజిస్ట్రేషన్లను క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నామని, మిగిలినవి కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లలో పలు అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో కడప, చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి, ప్రకాశం జిల్లాల్లోని ఆరు మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద తీసుకుని ఫ్రీహోల్డ్ భూములను రీవెరిఫికేషన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లాలో వీరబల్లి మండలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రక్రియను ఎలాంటి ఒత్తిళ్లకు గురి కాకుండా పారదర్శకంగా చేయాలని అధికారులకు చెప్పారు. దీనినికోసం ఒక ప్రొఫార్మా ఇచ్చామని, దాని ఆధారంగా రీవెరిఫికేషన్ పూర్తి చేయాలని చెప్పారు. వీరబల్లి మండలంలో 135 రిజిస్ట్రేషన్లకు రీవెరిఫికేషన్‌ను నిబంధనల ప్రకారం చేసి వారంలోపు నివేదికలు ఇవ్వాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియాదేవి, ఆర్డీవో రంగస్వామి, తహసీల్దార్లు, వీఆర్వో, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ జైళ్లశాఖ అదనపు డీఐజీగా రాజేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

కడప (క్రైం), ఆగస్టు 24 : రాయలసీమ జైళ్ల శాఖ అదనపు డీఐజీగా కె.రాజేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే కడప సెంట్రల్ జైలు పర్యవేక్షణ అధికారిగా కూడా ఆయన బాధ్యతలు స్వీకరించారు. విజయనగరానికి చెందిన ఈయన 2007 బ్యాచ్‌కు చెందిన గ్రూప్-1 అధికారి. ఉమ్మడి రాష్ట్రంలోని పలు జైళ్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైలులో పని చేస్తూ అటు రాయలసీమ డీఐజీగా అదనపు బాధ్యతలతో పాటు కడప సెంట్రల్ జైలు పర్యవేక్షణ అధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని, ఖైదీలకు రావాలసిన అన్ని సదుపాయాలను కేటాయిస్తామన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- గ్రామ పంచాయతీలకు అధికారం
- గ్రామసభలు.. అభివృద్ధి పనుల ప్రతిపాదనలు
- కూటమి ప్రభుత్వంలో మారనున్న పంచాయతీల రూపురేఖలు



ములకలచెరువు మండల కేంద్రంలో రోడ్డు కూడా లేని ఉర్దూ స్కూల్ ప్రాంతం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఆమె ఓ గ్రామ పంచాయతీకి ఎన్నికైన సర్పంచ్.. తాను పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన గ్రామ పరిధిలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడారు. రాబోయే రోజుల్లో తమ పంచాయతీ ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధికి ఏం చేద్దాం..? ఎలా అభివృద్ధి చేసుకుందాం..? అని అందరినీ అడిగారు. పంచాయతీ ప్రజల సమక్షంలో అందరి ఆమోదంతో తమ పంచాయతీలో చేపట్టాల్సిన వసతుల గురించి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంతవరకు చదివిన వాళ్లు ఇదేదో సినిమాలో సీన్ అనుకోవచ్చు. వాళ్లు అనుకోవడంలోనూ తప్పు లేదు.. ఎందుకంటే.. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో స్థానిక సంస్థలను ఛిన్నాభిన్నం చేశారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను సైతం పక్కకు మళ్లించారు. దేశానికి రాష్ట్రపతి ఎట్లనో..? గ్రామానికి సర్పంచ్ అట్లే. అయితే జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని సర్పంచ్ అనే మాటకే విలువ లేకుండాపోయింది. తమ ఐదేళ్ల పదవీ కాలంలో పంచాయతీ నిధులతో కనీసం జానెడు సిమెంటు రోడ్డు కూడా వేయలేకపోయారు.. తట్టెడు మట్టి ఎత్తలేకపోయారు. పంచాయతీరాజ్ వ్యవస్థనే కుక్కలు చింపిన విస్తరి చేశారు. దీంతో రాష్ట్ర ప్రజలు సర్పంచులు, గ్రామసభలు.. ప్రజల భాగస్వామ్యం.. సమిష్టి నిర్ణయాలు అనే మాటనే మర్చిపోయారు. ఇటువంటి నేపథ్యంలో రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లె సర్పంచ్ సంయుక్త గ్రామసభలో అధికారులు, ప్రజల సమక్షంలో చర్చించి గ్రామాభివృద్ధికి చేపట్టవలసిన చర్యలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఎన్నాళ్లకెన్నాళ్లకు మళ్లీ మంచి రోజులని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దేశాభివృద్ధికి స్థానిక సంస్థలే పట్టుకొమ్మలని పేర్కొంటున్నారు.

పల్లెలు పచ్చగా ఉంటే?

ఎక్కడైనా పల్లెలు పచ్చగా ఉంటే.. దేశం కూడా పచ్చగా ఉంటుంది. ఇక్కడ పల్లెలు అంటే గ్రామ పంచాయతీలు. రాజ్యాంగ నిర్మాతలు గ్రామ పంచాయతీ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ సమర్థవంతంగా ఉండాలంటే దేశ ప్రజలు పరిపాలనలో భాగస్వాములై ఉండాలి. పెద్ద దేశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారుమూల ప్రాంతాల సమస్యలను పరిష్కరించాలంటే.. సులభం కాదు. విశాలమైన భారతదేశంలో మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందరికీ అందాలంటే పరిపాలన/ పరిపాలనా వికేంద్రీకరణ చేయాల్సి ఉంటుంది. ఈ కారణంతోనే స్థానిక స్వపరిపాలనా విధానం ఏర్పాటైంది. స్థానికంగా సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ, మండల స్థాయి అధికారుల సమన్వయంతో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించుకోవడం. స్థానికంగా అందుబాటులో ఉన్న నిధులకు తోడు కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడపడం ఇదే పంచాయతీరాజ్ వ్యవస్థ స్వరూపం. గత ప్రభుత్వాల కాలంలో దాదాపు పంచాయతీలలో ఇదే పద్ధతి కొనసాగింది. సర్పంచ్ ఆధ్వర్యంలో ఆయా పంచాయతీల పరిధిలో వసూలయ్యే పన్నులకు తోడు.. ఆర్థిక సంఘం నిధులు కలిపి గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపింది. ఎప్పుడైతే స్థానికంగా సమస్యలు అక్కడే పరిష్కారం అయితే జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆయా గ్రామాలపైన ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన పని ఉండేది కాదు. ఉన్న గ్రామ పంచాయతీలలో అన్నీ కాకపోయినా చాలావరకు ఇదే విధంగా అభివృద్ధి జరిగితే ప్రభుత్వానికి అభివృద్ధిలో వెనుకబడ్డ గ్రామాలపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది

కుక్కలు చింపిన విస్తరిలా..!

అందుబాటులో ఉన్న నిధులను ప్రాధాన్యతా క్రమంలో వినియోగించుకునేందుకు.. గ్రామ స్థాయిలో గ్రామసభలు నిర్వహించాలి. సర్పంచ్ అధ్యక్షతన జరిగే ఈ సభలో అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొని గ్రామాభివృద్ధిపైన చర్చ జరగాలి. అయితే గత ఐదేళ్లలో ఇటువంటి పరిస్థితి రాష్ట్రంలో మచ్చుకైనాలేదు. వైసీపీ పాలనలో ఎక్కడా ఇటువంటి సభలు జరగలేదు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సభలలో పాల్గొన్నారు. అయితే ఏ సభలోనూ స్థానిక సర్పంచ్‌ను వేదిక మీదకు పిలిచిన జాడలేదు. కనీసం ఆ సభలో మాట్లాడే అవకాశం ఇచ్చిందీ లేదు. ప్రతిపక్ష పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌లే కాకుండా తమ పార్టీకే చెందిన సర్పంచ్‌లకు కూడా అదే పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి పైసా నిధులు కేటాయించలేదని సర్పంచులు వాపోతున్నారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోగా స్థానికంగా వసూలైన పన్నులను సైతం ప్రభుత్వానికే జమ చేయాల్సి వచ్చేది. అలా జమ చేసిన డబ్బును వాడుకోవడానికి వీలు లేకుండా ప్రభుత్వం చేసేది. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులనూ పక్కకు మళ్లించేవాళ్లు. దీంతో రెండు సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం ఈ నిధుల మళ్లింపును అడ్డుకునేందుకు గ్రామ పంచాయతీ అకౌంట్లకు నిధులు కేటాయించేందుకు.. ఒక ప్రత్యేక బ్యాంకు అకౌంటును తయారు చేయించింది.. అయినా ఈ అకౌంట్లలో పడిన మొత్తాన్ని సైతం రాష్ట్ర ప్రభుత్వం తీసేసుకుంది. దీంతో గ్రామ పంచాయతీలలో కనీస అవసరాలు తీరలేదు. వీధిలైట్ల ఏర్పాట్లు, రిపేర్లు, మంచినీటి సౌకర్యం, స్థానికంగా రోడ్లు, మురికికాలువల నిర్మాణం, శుభ్రం చేయడానికి కూడా నిధులు లేక సర్పంచులు లబోదిబోమన్నారు. జిల్లాలో 501 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో నిధులు లేక సర్పంచులు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు. లక్షలు ఖర్చు చేసి ఎన్నికల్లో గెలిచి.. ఐదేళ్లలో తమ పంచాయతీ పరిధిలో కనీసం రూపాయి విలువ చేసే అభివృద్ధి పనులు కూడా చేయలేకపోయామని వాపోయారు. దీంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో స్థానిక సంస్థలు అభివృద్ధికి నోచుకోక వైసీపీ విధానాలతో కుక్కలు చింపిన విస్తరిలా తయారయ్యాయని పలువురు సర్పంచులు బహిరంగంగానే పేర్కొంటున్నారు.



శుక్రవారం జరిగిన గ్రామసభలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు తమ గ్రామ సమస్యలు చెబుతున్న మైసూరివారిపల్లె సర్పంచ్ సంయుక్త

మారనున్న పంచాయతీల రూపురేఖలు

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పాలనలో పంచాయతీల రూపురేఖలు మారనున్నాయి. స్థానికంగా గ్రామ పంచాయతీలకే వాటి అధికారాలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. ఎక్కడ స్థానిక సంస్థలు బలంగా ఉంటాయో ఆ దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు ఈ నేపథ్యంలోనే శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీలలో పార్టీలు, రాజకీయాలకతీతంగా గ్రామసభలు జరిగాయి. ఈ సభల్లో స్థానికంగా అవసరమయ్యే అభివృద్ధి పనుల గురించి సర్పంచ్ ఆధ్వర్యంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చర్చించి తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాల మేరకు అందుబాటులో ఉన్న నిధులకు తోడు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన 15 ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న ప్రకారం గ్రామ పంచాయతీ వ్యవస్థను దెబ్బతీయకుంటే కేంద్రం కేటాయించే నిధులను తీసేసుకోకుంటే.. ఇంకా కావాల్సిన నిధులను కేటాయిస్తే..రాష్ట్రంలో గ్రామపంచాయతీల రూపురేఖలు మారిపోతాయి. ప్రజలకు అత్యంత అవసరమైన మౌలిక వసతులు కల్పించుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయవచ్చు. రోడ్లు నిర్మించవచ్చు. మురికినీటి కాలువల నిర్మాణంతో పాటు శుభ్రం చేయడానికి కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే అవసరం ఉండదు. అప్పుడు నిజంగానే గ్రామాలలో గాంధీజీ కన్న కలలు సాకారం అవుతాయి.

సిద్దవటంలో చిరుత సంచారం


- అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చిన స్థానికులు

సిద్దవటం, ఆగస్టు 24: సిద్దవటం మండలం నలందా స్కూల్ వెనుక భాగంలో నివాసం కల్పన, మనోజ్ కుటుంబీకులు మేకలు మేపుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం మేకను తినేందుకు చిరుత అక్కడికి వచ్చిందని, అక్కడున్న స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో అడవిలోకి పారిపోయింది. ఈ విషయాన్ని ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేశుకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న వారు వెంటనే అక్కడికి చేరుకుని స్థానిక ప్రజలను విచారించారు. అనంతరం పులికి సంబంధించిన ఆనవాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రి పూట ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే ఫోన్ చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ పెంచల్‌రెడ్డి, ప్రొటెక్షన్ వాచర్‌లు తదితరులు పాల్గొన్నారు.



చిరుత పాదముద్రలు తనిఖీ చేస్తున్న అటవీ శాఖాధికారులు

సహకార సంఘాల్లో సభ్యత్వాల ప్రక్షాళన



- ఎన్నికలకు సమాయత్తమవుతున్న సూచనలు
- ఐదేళ్లు కొనసాగిన త్రీమెన్ కమిటీలతో నిస్తేజం
- ఇన్‌చార్జ్‌ల పాలనతో మరింత నిర్వీర్యం
- థర్డ్ పార్టీ వెరిఫికేషన్‌తో వెలుగులోకి బోగస్ సభ్యత్వాలు

కలికిరి, ఆగస్టు 24: సహకార సంఘాలకు ఎన్నికలు జరిపే యోచనలో ప్రభుత్వం ముందడుగేస్తున్నట్లు జరుగుతున్న పరిణామాలు సూచిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు చూస్తే ప్రభుత్వం వీలైనంత త్వరలో ఎన్నికలు జరిపే వ్యూహంతో ఉన్నట్లు తెలుస్తోంది. పదకొండేళ్లకు పైబడి ఎన్నికలు లేకుండా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పాక్స్) నిర్వీర్యమయ్యాయని గుర్తించిన ప్రభుత్వం ఆ దిశగా సంఘాలను చక్కదిద్దేందుకు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో తొలి దఫాగా సంఘాల్లో ఉన్న సభ్యత్వాలను ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం థర్డ్ పార్టీ వెరిఫికేషన్ కోసం ఆదేశాలు జారీ చేసింది. మొత్తం సంఘాల్లోని సభ్యుల జాబితాలను ఆయా ఎంపీడీవోలకు అందజేశారు. గ్రామాల వారీగా సంఘ సభ్యుల వివరాలను సేకరించే విధంగా ఆదేశాలు వచ్చాయి. గ్రామ సచివాలయ ఉద్యోగులను సభ్యుల వివరాలు సేకరించేందుకు పురమాయిస్తున్నారు. దీంతో వాస్తవంగా ఆయా సంఘాల్లో ఉన్న సభ్యులెంత మంది, అందులో నిజమైన సభ్యులెవరు అనే విషయం తేల్చనుంది. దీనికి తోడు ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు మరోవైపు కేంద్రం కూడా కార్యాచరణకు పూనుకొంది. కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఒక పోర్టల్‌ను రూపొందించి నిజమైన సభ్యుల వివరాలను పూర్తిగా క్రోడీకరించి ఈ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. పనిలో పనిగా బోగస్ సభ్యులను ఏరివేసి వాస్తవ సభ్యులు ఎంతమంది ఉన్నారో తేలిన తరువాత కొత్త సభ్యులను నమోదు చేసుకునే విషయమై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. సంఘ సభ్యుల నమోదు పక్కాగా పూర్తయిన తరువాత ఎన్నికలు జరిపేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సగానికి సగం బోగస్ సభ్యత్వాలు

జిల్లాల విభజన జరిగినా సహకార సంఘాల పాలనా వ్యవహారాలన్నీ ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే జరుగుతున్నాయి. ఆ లెక్కన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 76 సంఘాలున్నాయి. వీటి వ్యవహారాలన్నీ చిత్తూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అజమాయిషీలోనే నడుస్తున్నాయి. ఇక మొత్తం అన్నమయ్య జిల్లాలో 40 సంఘాలున్నా రాయచోటి, రాజంపేట డివిజన్‌లోని సంఘాలు మాత్రం ఉమ్మడి కడప జిల్లా డీసీసీబీ పరిధిలోనే కొనసాగుతున్నాయి. ఒక్కో సంఘంలో సరాసరిన రెండు వేల మంది సభ్యులు నమోదై ఉన్నారు. ఆ లెక్కన అన్నమయ్య జిల్లాలో మొత్తం 80 వేల మంది వరకు రైతులు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఏ సంఘంలోనూ సభ్యులకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో లేవని ప్రభుత్వం గుర్తించడంతో బోగస్ సభ్యత్వాలను తొలగించి ప్రక్షాళన చేయడానికి సమాయత్తమయ్యారు. ఇలా సభ్యుల పూర్తి వివరాలను సేకరించే పనిని జిల్లాలో ఎంపీడీవోలకు అప్పగించారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా వారం రోజులుగా వివరాలు సేకరించడంలో నిమగ్నమయ్యారు. చివరికి సగానికి సగం మంది సభ్యుల వివరాలు దొరకడం లేదని చెబుతున్నారు. చాలా కాలం క్రితమే చనిపోయిన వారు కూడా సభ్యులుగా కొనసాగుతున్నట్లు గుర్తించారు. రైతులకు సంబంధించిన భూముల వివరాలు కూడా నమోదు కాలేదు. ఆధార్ నెంబర్లు కూడా దొరకడం లేదని క్షేత్రస్థాయిలో గుర్తించారు. పాసుపుస్తకాల ఖాతా నెంబర్లు లేకపోవడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. ఖాతా నెంబర్లు కూడా తెలియకుండా ఎలా రుణాలు మంజూరు చేశారో అర్థం కావడం లేదని విస్తుపోతున్నారు. అసలు ప్రస్తుతం ఉన్న సంఘాల్లో రుణాలు తీసుకోనివారు, తీసుకున్న వారి వివరాలు స్పష్టంగా లేనట్లు తెలుస్తోంది.

ఎన్నికల కోసం ఎడాపెడా సభ్యత్వాలు

సహకార సంఘాల ఎన్నికల సమయంలో గడువు ముగిసేనాటికి రెండు మూడు రోజుల ముందు ఎడాపెడా సభ్యత్వాలను నమోదు చేయడమే ఈ గందరగోళానికి కారణంగా చెబుతున్నారు. సింగిల్ విండోల అధ్యక్ష పదవులను ఆశించే వారు సభ్యుల తరపున తామే రూ.350 వంతున సభ్యత్వ రుసుం చెల్లించడం ఈ అనర్థానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఆ సమయంలో సభ్యులకు సంబంధించిన ఎలాంటి వివరాలు లేకుండా కేవలం రుసుం చెల్లిస్తేనే సభ్యులుగా నమోదయ్యే వారికి ఎలాంటి సంబంధం లేకుండా సభ్యత్వాలను నమోదు చేసి పబ్బం గడుపుకున్నారు.

11 ఏళ్ల క్రితం సహకార సంఘాల ఎన్నికలు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఉమ్మడి రాష్ట్రంలో 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం 2018లో నిర్వహించాల్సి ఉన్నా కొద్ది నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా అవి వాయిదా పడ్డాయి. దీంతో టీడీపీ ప్రభుత్వంలో అధికార్లను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. అనంతరం వైసీపీ పాలనలో త్రీమెన్ కమిటీల పేరుతో వైసీపీ నాయకులను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించి కొనసాగించారు. ఈ త్రీమెన్ కమిటీల నియామక గడువును ప్రతి ఆరు నెలలకోసారి పొడిగిస్తూ కాలం నెట్టుకొచ్చింది. సహకార సంఘాల గురించి కనీస పరిజ్ఞానం లేని వారిని కూడా పెద్ద సంఖ్యలో ప్రభుత్వం నామినేట్ చేయడంతో సంఘాలు నిర్వీర్యమయ్యాయనే విమర్శలున్నాయి. తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో త్రీమెన్ కమిటీలు రాజీనామా చేయడంతో తిరిగి ప్రభుత్వం అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. ప్రస్తుతం సొసైటీల్లో సభ్యత్వాల ప్రక్షాళన జరుగుతుండటంతో త్వరలో సింగిల్‌విండోలకు ఎన్నికలు రావొచ్చనే సంకేతాలున్నాయని చెబుతున్నారు. దీనికి తోడు గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తులు, జిల్లా పరిషత్తులకు మరో రెండున్నరేళ్ల తరువాత గానీ ఎన్నికలు వచ్చే అవకాశం లేదు. ఈలోగా సహకార ఎన్నికలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోందని అంటున్నారు.





విలేకరుల సమవేశంలో మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

టీడీపీతోనే గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం


- రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, ఆగస్టు 24: వైసీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలు, సర్పంచ్ పదవులు నామమాత్రంగా ఉండేవని, సర్పంచ్‌లకు ఎలాంటి అధికారాలు లేక ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే ఉండేవారని, టీడీపీతోనే పంచాయతీలకు పూర్వ వైభవం దక్కిందని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ పంచాయతీలకు విశిష్ట అధికారాలు, నిధులు ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం ఉన్న రోజుల్లో గ్రామ పంచాయతీలు అంధకారంలో ఉండేవని ఆయన తెలిపారు. నేడు చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే పంచాయతీలకు వెలుగులు వచ్చాయన్నారు. గ్రామ పంచాయతీలకు నేడు పూర్వవైభవం దక్కిందని, గ్రామసభలు ప్రతినెలా నిర్వహించడం వల్ల గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు కలుగుతుందన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు, మైనార్టీ గుల్జార్‌బాషా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, కోవూరు సుబ్రమణ్యంనాయుడు, దగ్గుపాటి సుబ్రమణ్యంనాయుడు, మైనార్టీ నేతలు కరీం, మండెం అబూబకర్, సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బసినికొండకు పోటెత్తిన భక్తులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 24: పురాతన చరిత్ర ఉన్న బసినికొండపైన వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయం శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. మదనపల్లె పట్టణ శివారులోని బసినికొండలో వేంకటేశ్వరస్వామి పాదం మోపారని భక్తుల విశ్వాసం. అక్కడే కొండ అంచున శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వెలిశారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో నాలుగు శనివారాల్లో భక్తులు 2,072 అడుగుల ఎత్తయిన బసినికొండ ఎక్కి మొక్కులు చెల్లించుకుంటారు. ఉదయం నుంచే భక్తులు బసినికొండ పడమర వైపున వున్న 1300 మెట్లు కాలినడక ఎక్కుతూ గోవింద నామాలు పాడుతూ తోటి భక్తులకు ఉత్సాహం నింపారు. అలాగే బసినికొండ తూర్పు వైపు నుంచి కూడా బసినికొండ, రామాచార్లపల్లె, గంగన్నగారిపల్లె ప్రజలు పెద్దఎత్తున కొండపైకి ఎక్కి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.





బసినికొండ మెట్లు ఎక్కుతున్న భక్తులు



ఆలయంలోకి వెళ్లేందుకు క్యూలో నిల్చున్న భక్తులు

క్రీడలతో ఆత్మవిశ్వాసం

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 24: క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు, ఆరోగ్యాన్ని సమకూరుస్తాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ 89వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్-17 క్రీడా పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లో పాల్గొని రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ పిల్లల్లో శారీరక దృఢత్వం పెంపొందించాలంటే క్రీడలు చాలా ముఖ్యమని, క్రీడాకారులు రాబోవు రోజుల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి భారతదేశానికి మంచిపేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త కోడి శ్రీనివాసులరెడ్డి, ప్రైవేటు కళాశాలల రాష్ట్ర అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణ, మానవత సంస్థ చైర్మన్ శివగంగిరెడ్డి, సుండుపల్లె మండల టీడీపీ నాయకులు శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి సభ్యులు బుక్కే విశ్వనాథనాయక్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు నరసరాజు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, నియోజకవర్గ నాయకులు రఘుపతి, సతీశ్‌నాయక్, శ్రీధర్ నాయక్, నాగార్జున, మణి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..

పట్టణంలోని కొత్తపేట శివరామాలయంలో మంత్రి మండిపల్లి పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పరిధిలోని గరగుపల్లి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పల్లపువాసు, మాజీ సర్పంచ్ బసయ్యల ఆధ్వర్యంలో గరుగుపల్లి గ్రామస్తులు మంత్రి మండిపల్లికి బ్యాండు మేళాలు, బాణసంచాతో ఘనంగా స్వాగతం పలికారు.

చౌడేశ్వరి దేవాలయంలో కుటుంబ సమేతంగా పూజలు

చిన్నమండెం: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా శనివారం చిన్నమండెం మండలం పడమటికోన గ్రామంలోని చౌడేశ్వరి ఆలయంలో సతీమణి హరితరెడ్డి, కుమారుడు నిశ్చల్‌నాగిరెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రి కుటుంబానికి స్వాగతం పలికి , పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రామాపురం: మం డలంలోని చిట్లూరు హరిజన వాడలో ఉన్న ఆంజనేయ స్వామి గుడిలో మంత్రితోపాటు మాజీ ఎమ్మెల్యే గడికోట



క్రీడా పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ద్వారకనాథరెడ్డి పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్లూరు గ్రామ ప్రజల సమస్యలు పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. పోశాల వెంకట్రమణ, గాలివీటి మల్‌రెడ్డి కుమారుడు లోకేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మురళీ కృష్ణ, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు గాలివీడులో మంత్రి పర్యటన

గాలివీడు: నేడు గాలివీడులో రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పర్యటించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్యారంపల్లె గీదరవాండ్లపల్లెలో టీడీపీ నాయకులు గీదర ఈశ్వర్‌రెడ్డి కుమారులు గీదర ధర్మారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి (ఎన్‌ఆర్‌ఐ) ఇస్తున్న విందులో ఆయన పాల్గొననున్నారు. కార్యక్రమానికి ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పలువురు టీడీపీ నాయకులు హాజరుకానున్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్డు పంపిణీ



వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న డాక్టర్ షఫీనాయక్

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 24: రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖల మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా రాజంపేట పార్లమెంట్ డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయక్ ఆధ్వర్యంలో మండపల్లె వద్దనున్న వృద్ధాశ్రమంలో శనివారం పండ్లు, బ్రెడ్డు, తినుబండాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ యువ నాయకుడు పక్కీరయ్య, రవీంద్రనాథ్, కావలి అంజనేయులు, షేక్‌మస్తాన్, ఇమ్రాన్, చంద్ర, సాధిక్, రఫీక్‌బాషా తదితరులు పాల్గొన్నారు

ప్రతి అమ్మ పేరిట ఒక మొక్క నాటాలి



మొక్కలు నాటుతున్న ఫారెస్టు సెక్షన్ అధికారి షకీల్ అహ్మద్

రామాపురం, ఆగస్టు 24: ప్రతి అమ్మ పేరిట ఒక మొక్కను నాటాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి షకీల్‌అహ్మద్ అన్నారు. మండలంలోని గువ్వలచెరువు ఘాట్ రోడు లోని ఎకో అరణ్య టూరిజం పార్క్ వద్ద శనివారం 30 వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘాట్ రోడ్డులో ఎకో అరణ్య టూరిజం పార్కు ఏర్పాటుతో టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ పార్కులో నీడనిచ్చే చెట్లను, పూలమొక్కలను నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో బాషా, మద్దిమడుగు తూర్పు బీట్ ఫారెస్ట్ సిబ్బంది, టీడీపీ నాయకుడు చీకటి హరిప్రసాద్, గువ్వలచెరువు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తకు ప్రశంసలు



శివప్రసాద్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న సుగవాసి

సిద్దవటం, ఆగస్టు 24 : తెలుగుదేశం పార్టీ కంటెంటును విస్తృత స్థాయిలో షేర్ చేసి టాప్ పెర్ఫార్మర్‌గా నిలిచిన మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన పొట్టి శివప్రసాద్‌ను ప్రశంసిస్తూ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు. ఈ ప్రశంస పత్రాన్ని శనివారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో ఇన్‌చార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి నాగముని రెడ్డి, మాధవరం-1 5వ వార్డు ప్రతినిధి బండి ఓబులేశు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు సుగవాసి పరామర్శ



రామారావును పరామర్శిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట టౌన్, ఆగస్టు 24 : రాజంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండల టీడీపీ నాయకుడు నాగినేని రామారావును టీడీపీ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. టీడీపీ నేతలు గీతాంజలి రమణ, న్యాయవాది లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు సుబ్బనరసయ్య, మేక నరసింహులు, సుధీర్, నాగేష్, సుదర్శన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలి



ఐక్యత చాటుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

రాయచోటిటౌన్, ఆగస్టు 24: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బీసీ భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలన్నారు. పేద పిల్లల ఉద్యోగ స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రాజంపేట, మదనపల్లె,రాయచోటి ప్రాంతాల వారికి అందుబాటులో ఉండే విధంగా స్టడీ సెంటర్లను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. దేశంలో దాదాపు 3,743 కులాల వెనుకబడి ఉన్నాయని మండల్ కమిషన్ గుర్తించిందన్నారు. అందులో 63.4 శాతం హిందూ కులాలు, 8.3 శాతం ముస్లిం మైనార్టీలు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు నరసింహాచారి, జిల్లా మహిళా అధ్యక్షురాలు వల్లెపురమణమ్మ, కార్యదర్శి ఇమాముల్లా, గౌరవాధ్యక్షుడు నాగార్జునాచారి, వెంకట్రమణ, తిప్పయ్య, ట్రెజరర్ సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వరయ్య, యువజన సంఘం అధ్యక్షుడు పాలగిరి హబీబుల్లా, కార్యదర్శి వెంకటేశ్, రాయచోటి తాలూకా కార్యవర్గ సభ్యుడు, రాయచోటి తాలూకా ప్రెసిడెంట్ సంచుల ఖాదర్‌బాషా, రమేశ్, శెట్టిపల్లి రెడ్డెయ్యజిల్లా కార్యవర్గ సభ్యులు పీ. రెడ్డెయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం: డీఎస్పీ



ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ సుధాకర్, సీఐ వెంకటేశ్వర్లు

రాజంపేట, ఆగస్టు 24 : అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ ఎన్. సుధాకర్ హెచ్చరించారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో రాజంపేట డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆయన తెలిపారు. మట్కా, గాంబ్లింగ్, కోడిపందేలు లాంటి అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలన్నారు. వాహన తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను సత్వరం పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో రాజంపేట ఇన్‌స్పెక్టర్ ఎల్లమ రాజు, రూరల్ సీఐ బీవీ రమణ, మన్నూరు సీఐ రామాంజనేయులు, కోడూరు సీఐ హేమసుందర్ రావు, కోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, డివిజన్‌లోని ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ ఎన్.సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో కేసుల రికార్డులు పరిశీలించారు. అనంతరం కేసుల ఛేదించే విధానంలో సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని సూచనలు చేశారు. అలాగే సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళ సంరక్షణకు పాటుపడాలని ఎర్ర చందనం, గాంబ్లింగ్, కోడిపందేలు, సైబర్ నేరాలను సహించేది లేదని తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 24: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని వెంకయ్య స్వామి వారి ఆరాధనోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం 20 ఏళ్ల కొనసాగాలని ఆ దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

పెనగలూరు, ఆగస్టు 24 : మండలంలోని నాగిరెడ్డిపల్లె వెంకయ్యస్వామి దేవాలయంలో శనివారం ధర్మకర్త పెదమళ్ల బుజ్జిరెడ్డి స్వామి అధ్యక్షతన ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అందజేసిన కానుకలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో పలు భజన బృందాలు వెంకయ్యస్వామి భక్తిగీతాలు ఆలపించాయి. అలాగే అన్నమయ్య ఇతర భక్తి గీతాలు, పద్యాలు పాడి భక్తులను ఆకట్టుకున్నారు. మరో రెండు రోజులు ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు బుచ్చిరెడ్డిస్వామి తెలిపారు.

కోరం లేక .. ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశం వాయిదా



సమావేశానికి హాజరైన అధికారులు

ఒంటిమిట్ట, ఆగస్టు 24 : కోరం లేక పోవడంతో ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా చింతరాజుపల్లె ఎంపీటీసీగా ఉన్న గడ్డం జనార్దన్‌రెడ్డి చనిపోవడంతో ప్రస్తుతం 8 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. కాగా, శనివారం నిర్వహించిన సమావేశానికి వారిలో ఒక్కరు కూడా హాజరు కాకపోవడంతో ఎంపీడీవో రెడ్డయ్య సమావేశాన్ని వాయిదా వేశారు. . మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉండగా ఒంటిమిట్ట, రాచగుడిపల్లె సర్పంచులు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. వైసీపీ ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి సమావేశానికి హాజరవుతుండడంతో, ఆ సమావేశాన్ని బహిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే మేడా తన అనుచరులకు చెప్పడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్న ప్రచారం ఉంది. కాగా, సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు హాజరయ్యారు. సమావేశం వాయిదాతో వారంతా వెనుదిరిగారు. మండల సమస్యలను చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు తమ ఆధిపత్యం కోసం సమావేశానికి హాజరు కాకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. సమావేశంలో తహసీల్దారు రమణమ్మ, ఈవోపీఆర్డీ రంగయ్య, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ వేషధారణలో ఉట్టి కొడుతున్న చిన్నారి

నందలూరు, ఆగస్టు 24 : మండలంలోని అన్నమాచార్య అకాడమీ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ చేయించారు. అనంతరం చిన్నికృష్ణులతో ఉట్టి కొట్టించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్, డైరెక్టర్ మాడపూరి హేమలత, ప్రధానోపాధ్యాయుడు బాలాంజనేయులు, డైరెక్టర్ ఉమామహేష్, అధ్యాపక బృందం విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విస్డమ్ పాఠశాలలో కూడా వేడుకలు నిర్వహించారు. అరవపల్లెలోని శ్రీకృష్ణ గీతామందిరంలోసోమవారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కుర్ర మణియాదవ్ తెలిపారు. ఉదయం 8 గంటలకు గోపూజ, 10 నుంచి 11.30 గంటలలోగా కల్యాణ మహోత్సవం, 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు ఆలయం దగ్గర అల్పాహార విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సుండుపల్లె: సుండుపల్లె మండల కేంద్రంలోని వశిష్ట హైస్కూల్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులను శ్రీకృష్ణుడు, గోపికలుగా ముస్తాబు చేసి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల సాంస్కృతి కార్యక్రమాలతో అలంకరించారు. కరస్పాండెట్ రెడ్డెయ్యరాజు విద్యార్థులను అభినందించారు.

రాజంపేట టౌన్ :పట్టణంలోని పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణుని వేషదారణలో హాజరయ్యారు శ్రీకృష్ణుడు గోపికలతో కూడిన పలు అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు .పాఠశాల వ్యవస్థాపకుడు ప్రభాకర్‌నాయుడు, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రైల్వేకోడూరు(రూరల్): పట్టణంలోని గౌరీశంకర్, సిల్కర్ బెల్స్ ప్రైవేట్ పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పిల్లలు శ్రీకృష్ణ, రాధ, గోపిక, వేషధారణలో అలరించారు. పిల్లలతో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన పలు ఆటల పోటీల్లో గెలుపు పొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరీ శంకర్ స్కూల్ కరస్పాండెంట్ గోపీనాథ్, సిల్కర్ బెల్స్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.వి.కుమార్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

గాలివీడు, ఆగస్టు 24: సమస్యలు పరిష్కరించాలంటూ విద్యుత్ కార్మికులు సెప్టెంబరు 5న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గాలివీడులో పర్యటించిన ఆయన స్థానిక విద్యుత్ కార్యాలయంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్లు, మీటర్ రీడర్స్, స్టోర్స్ హమాలీలు, బిల్ కలెక్టర్లు, జెన్కో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అన్ని విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్థలో పనిచేసే ప్రతి కార్మికుడిని రెగ్యులర్ చేయాలని, 2022 పీఆర్‌సీ అరియర్స్ వెంటనే చెల్లించాలని, నూతన ఆపరేటర్లకు పాత ఆపరేటర్లతో సమానంగా రూ.27,953 వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, వెంకట్రమణ, ధనుంజయ్‌నాయక్, సాయి, శ్రీనువాసులు, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బేస్‌లైన్ పరీక్షలు



పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు

సంబేపల్లె, ఆగస్టు4: సీబీఎస్‌ఈ పరీక్షలు రాయబోతున్న పదవ తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసే పనిలో భాగంగా నిర్వహిస్తున్న బేస్‌లైన్ పరీక్షలు ముగిసినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఎంఈవో-2 శ్రీనివాసులు తెలిపారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పరీక్షలను సబేపల్లె మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు సందర్శించి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులను అందజేశారు. విద్యార్థులు రోజుకు కనీసం రెండు పదాలైనా నేర్చుకోవాలన్నారు. విద్యార్థులకు ఈ నిఘంటువు జీవితాంతం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు, నాగభూషణం పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల ఏర్పాటు

ఓబులవారిపల్లె, ఆగస్టు 24 : విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్న చిన్నఓరంపాడు పంచాయతీ కమ్మపల్లె హరిజనవాడలోని పలు కుటుంబాలకు కూటమి ప్రభుత్వంలో ఊరట లభించింది. ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో సుమారు 50 కుటుంబాలు అవస్థలు పడుతున్నాయన్న విషయాన్ని స్థానికులు ఎన్నికల ప్రచార సమయంలో టీడీపీ ఇన్‌చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆమె అధికారులతోమాట్లాడి విద్యుత్ స్తంభాలు, వైరు మంజూరు చేయించారు. దీంతో సర్పంచ్ గద్దె పెంచలయ్య, టీడీపీ నాయకులు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పనులు చేయించా. విద్యుత్ సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

బీపీ, షుగర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సిద్దయ్య

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు 24: మండలంలో బీపీ, షుగర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని కోనంపేట వైద్యాధికారి డాక్టర్ సిద్దయ్య తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాటా_డారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి గర్భిణులను గుర్తించి పేర్లు నమోదు చేయించాలన్నారు. 30 ఏళ్ల పైబడిన వారందరికీ రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రవీంద్ర, నీతి అబియోగ్ అధికారి వెంకటరామిరెడ్డి, సూపర్‌వైజర్ సరస్వతి, ఎంఎల్ హెచ్ పీ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయాల్లో శ్రావణ శనివారం పూజలు



కమ్మపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న సుబ్బయ్యనాయుడు



గాలివీడు: ఆలయంలో అన్నదానం చేస్తున్న భక్తులు

రాయచోటిటౌన్, ఆగస్టు 24: శ్రావణ శనివారం సందర్భంగా మండల పరిధిలోని కమ్మపల్లి సమీపంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కమ్మపల్లి గ్రామస్తులు భక్తులకు అన్నదానం చేశారు. బీసీ సాధికారత రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్‌నాయుడు పూజలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్యనాయుడు, గ్రామ నాయకులు శ్రీనివాసులునాయుడు, అంజనేయులు నాయుడు, బాలకృష్ణనాయుడు, నాగేందర్ నాయుడు, వేణుగోపాల్‌నాయుడు, చిన్నపరెడ్డి, రెడ్డెయ్య, రామచంద్ర, పైనేని రవిశంకర్, ఆదినారాయణ, చంద్రశేఖర్, రవీందర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: మండలంలోని బ్రాహ్మణవీధి వెంకటేశ్వరస్వామి, కుమ్మర పల్లి చెరువుకట్ట పై ఉన్న ఆంజనేయస్వామి, గండి మడుగు ఉమామహేశ్వర స్వామి, గోరాన్‌చెరువు గుట్ట గట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. బ్రాహ్మణవీధిలోని ఆలయంలో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. అనంతరం దాతల సహకా రంతో దాదాపుగా 400 మందికి అన్నప్రసాద వితరణ చేశారు.

సంబేపల్లె: పాలబండ. గుట్టపల్లి , ప్రకాశ్‌నగర్ కాలనీ ఆంజనేయస్వామి ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భజనలు చేశారు. పాలకొండ ఆంజనేయస్వామి ఆలయం వద్ద దాత మణికంఠ, మౌనిక దంపతులు అన్నదానం చేశారు. .

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన వీఆర్వో నాని

సిద్దవటం, ఆగస్టు 24 : మండలంలోని కనుమలోపల్లి పరిధిలోని సర్వే నెంబరు 70లో ఉన్న దాదాపు నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఓ ఉద్యోగి ఆక్రమించా డంటూ ఓ మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో సిద్దవటం మండల తహసీల్దారు మురాషావలి, రెవెన్యూ సిబ్బంది విచారణ చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణను నిర్ధారించడంతోపాటు, అక్కడ ఎలాంటి పనులు చేపట్టకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక వీఆర్వో నాని మాట్లాడుతూ కడప - చెన్నై రహదారి కనుమలోపల్లి రెవెన్యూ పొలంలో సర్వే నంబరు 70లో ఎటువంటి కట్టడాలు నిర్మించకూడదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ వెంకటసుబ్బయ్య దేవదాసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కేబీజీవీలో హెచ్‌ఐవీపై అవగాహన



హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంబేపల్లె, ఆగస్టు 24: అవగాహనతో హెచ్‌ఐవీ బారిన పడకుండా రక్షించుకోవచ్చని డీఆర్పీ అల్లావలి, ఎస్‌వో పద్మావతి అన్నారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కస్తూరిబాగాంధీ గురుకుల పాఠశాలలో శనివారం హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చికిత్స కన్నా నివారణ మంచిదని తెలిపారు. లైంగిక సంపర్కాలు, కలుషితమైన సూదులు, సిరంజీలు, పరీక్షింపబడని రక్తం ద్వారా, హెచ్‌ఐవీ ఉన్న గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు ఈ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. ఆసుపత్రుల్లో హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. హెచ్‌ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయితే, ఉచితంగా ఏఆర్‌టీ మందులు ఇస్తామన్నారు. అన్నమయ్య జిల్లాలో ఆగస్టు 12 నుంచి అక్టోబరు 12 వరకు 200 గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత, మహిళలు, పొదుపు సంఘాలు, కార్మికులు, ప్రజలను భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, లింక్ వర్కర్స్ స్కీమ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సిద్దవటం, ఆగస్టు 24 : మండలంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పెద్దపల్లె, సిద్దవటం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

నందలూరు, ఆగస్టు 24 : స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే ఉన్న వరసిద్ది వినాయక స్వామి ఆలయంలో శనివారం ఉదయం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. తెల్లవారు జామున 4.20 గంటలకు రామచంద్ర, జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో శనీశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

అన్నమాచార్య యూనివర్సిటీలో గెస్ట్ లెక్చర్

రాజంపేట, ఆగస్టు 24 : రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో శనివారం తృతీయ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు గెస్ట్‌లెక్చర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బెంగుళూరుకు చెందిన ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌కంపెనికి చెందిన ఎల్.భానుప్రాష్ ఆసిక్ డిజైన్ సీనియర్ ఇంజనీర్ సినాఫ్సిస్ విద్యార్థులకు స్ట్రాటజిస్ ఫర్ మోడ్రణ్ వీఎల్‌ఎస్‌ఐ డిజైన్ అనే అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌ఎంవీ నారాయణ, ఈసీఈ విభాగాదిపతి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ సీహెచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో 1.560 కిలోల బంగారు స్వాధీనం

- బంగారం విలువ రూ.కోటీ ఐదు లక్షలు
- ఇన్‌కమ్‌ట్యాక్స్‌కు అప్పగిస్తున్నట్లు సీఐ వెల్లడి



స్వాధీనం చేసుకున్న బంగారం పంచనామా అందిస్తున్న సీఐ

కడప (క్రైం), ఆగస్టు 24: వాహనాల తనిఖీలో 1.560 కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు కోటి ఐదు లక్షల రూపాయలు ఉంటుందని ఆయన వెల్లడించారు. వివరాల్లోకెళితే...

కడప నగరం రెండో గాంధీ బొమ్మ వద్ద ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కడప ఇన్‌చార్జ్ పోలీసు అధికారి వెంకటరాముడు సూచనల మేరకు వన్‌టౌన్ సీఐ భాస్కరరెడ్డి, ఎస్ఐలు అమర్‌నాథరెడ్డి, రంగస్వామి సిబ్బందితో వాహన తనిఖీ చేపట్టారు. టీకేఎం స్ట్రీట్ వాసి దేశ్‌ముఖ్ భరత్‌రాజారావ్ బైక్‌లో బ్యాగుతో వెళుతుండగా అతన్ని తనిఖీ చేశారు. బ్యాగులో కేజీ 560 గ్రాములు బంగారు బిస్కట్లు, కడ్డీలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. బంగారు సంబంధిత బిల్లులు తన వద్ద లేవన్నారు. బంగారు బ్లాక్‌లో అమ్ముతున్నట్లు గుర్తించామన్నారు. తదుపరి చర్యలు నిమిత్తం సీజ్ చేసిన బంగారాన్ని తిరుపతిలోని ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంటుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

కాటేసిన ఖరీఫ్

- ఎడారిగా మారిన వ్యవసాయ భూములు
- గణనీయంగా తగ్గిన సాగు
- ఆదాయాన్ని కోల్పోతున్న రైతులు
- రబీపైనే రైతుల ఆశలు

గాలివీడు, ఆగస్టు 24: కరువు కాటకాలకు నిలయమైన రాయలసీమ జిల్లాల్లోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం ఇది. ఈ ప్రాంతీయులు నిత్యం కరువు కాటకాలతో పోరాడుతూనే ఉంటారు. ఒకప్పుడు పంట పొలాలతో కళకళలాడే భూములు, నేడు వర్షాలు లేక పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వేలాది ఎకరాలు బీడు భూములుగా మారిపోయాయి. ఫలితంగా రైతులు లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఈ ఏగాది రైతులను ఖరీఫ్ కాటేసినట్లు అయ్యింది. వివరాల్లోకి వెళితే...

రాయచోటి నియోజకవర్గం గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి మండలాలు కొన్నేళ్లగా కరువు కాటకాలకు నిలయంగా మారింది. ఇందులో 80 శాతం కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతీయులు ఖరీఫ్‌లో వేరుశనగ, వరి ఎక్కువగా సాగు చేసేవారు. మెట్ట, ఎగుడు, దిగుడు భూములతో కూడిన ప్రాంతం కాబట్టి ఈ భూముల్లో వేరుశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేసేవారు. నియోజకవర్గ వ్యాప్తంగా 80 వేల ఎకరాలకు పైబడి వేరుశనగ సాగు భూమి కలదు. 30 వేల ఎకరాలకు పైబడి వరిని, మరికొంత భూమిలో ఇతర పంటలు, మామిడి, జామ, సపోట వంటి తోటలను పెంచుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల ఎకరాల్లో కూడా వేరుశనగ సాగు చేసిన దాఖలాలు లేవు. వరి కనీసం కనుచూపు మేర కూడా కనపడలేదు.



పంటలకు నోచుకోని వ్యవసాయ భూములు

సాధారణంగా మే, జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు కురిసి ఉంటే వేరుశనగ అధిక విస్తీర్ణంలో సాగు చేసేవారు. కానీ ఆ నెలల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వేలాది ఎకరాలు బీడు భూములుగా మారిపోయాయి. ముఖ్యంగా గాలివీడులో 30 వేల ఎకరాలు, సంబేపల్లెలో 20 వేలు, చిన్నమండెంలో 18 వేలు, రామాపురంలో 19 వేలు, లక్కిరెడ్డిపల్లెలో 19 వేలు, రాయచోటి రూరల్ 21 వేల ఎకరాలు సాగు భూమి కలదు. ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఆ భూములన్నీ ఎడారిని తలపిస్తున్నాయి. గతంలో రాయచోటి నియోజక వర్గంలో వేరుశనగను రారాజు పంటగా అభివర్ణించే వారు. సెంటు బీడు భూమి లేకుండా వేరుశ నగను సాగుచేసే వారు. ఏ ఇంట్లో చూసినా వందల బస్తాలు వేరుశనగ మూటలతో నిండి ఉండేది. ఒకప్పుడు పల్లెల్లోని రైతులు తాము పండించిన వేరుశనగ కాయలు అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయంతో పట్టణాల్లో స్థలాలు, ఇళ్లను కొనుగోలు చేశామని చెప్పేవారు. నేడు ఆ పరిస్థితులు లేవు. రైతుల పరిస్థితి దీనావస్థలో ఉంది. వర్షాలు లేక పంటలు సాగులేక బతుకు బండి నడపడం భారమైపోతోం దని రైతులు వాపోతున్నారు. కనీసం రబీ సీజన్‌లో నైనా వర్షాలు పడితే రైతులకు కొంత మేరకు ఉపశమనం కలుగుతుందని వర్షాలు పడకపోతే ఊర్లైనా ఖాళీ చేసి వలస వెళ్లిపోవాల్సి ఉంటుందని పలువురు రైతులు పేర్కొన్నారు.

రబీపైన మా ఆశలు



ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలుపడక పోవడంతో పంటలను సాగు చేయలేదు. బోరుబావుల కింద ఏదోకొద్దిగా సాగు చేశాము. వరి సాగనేది లేకుండా పోయింది. కానీ రబీలోనైనా వర్షాలు కురిస్తే వరి, వేరుశనగను సాగు చేసి కుటుంబాలను పోషించుకుంటాము. ఖరీఫ్‌లో కూడా వర్షాలు పడకపోతే ఊర్లకు ఊర్లు ఖాళీ చేయవల్సిన పరిస్థితి నెలకొంటుంది.

శివప్పనాయుడు, గొట్టివీడు

లక్షల్లో ఆదాయం కోల్పోయాము



గతంలో వర్షాలు సకాలంలో కురిసేవి. తద్వారా ఖరీఫ్ సీజన్‌లో ఒక సెంటు భూమికూడా ఖాళీగా ఉండేదికాదు. మొత్తం భూమిలో వేరుశనగ సాగు చేసేవాళ్లము. ఒక్కొక్కరు వంద నుంచి 200 బస్తాలు వేరుశనగను పండించేవారము. కానీ నేడు ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడ లేదు. తద్వారా రైతులందరూ లక్షల్లో ఆదాయాన్ని కోల్పోయాము.

పిచ్చయ్య, పూలుకుంట

వృద్ధురాలిని మోసగించి రూ.70వేలు విత్‌డ్రా

- సీఐకి ఫిర్యాదు చేసిన బాధితురాలు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న ఆదిలక్షుమ్మ

చెన్నూరు, ఆగస్టు 24: కనుపర్తికి చెందిన దండుబోయిన ఓబన్న భార్య ఆదిలక్షుమ్మ బ్యాంకు ఖాతా నుంచి వెంకటేష్ రూ.70వేలు డబ్బును డ్రా చేసుకున్నట్లు బాధితురాలు సీఐ పురుషోత్తంరాజుకు శనివారం ఫిర్యాదు చేశారు. చెన్నూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఆదిలక్షుమ్మకు 91131107823 ఖాతా ఉంది. ఇందులో రూ.70వేలకు పైగా నగదు నిల్వ చేసుకుంది. అయితే అదే గ్రామస్థుడ వెంకటేశ్ ఆమెను మోసగించి విత్‌డ్రా ఫారంలో బొటనవేలి గుర్తు వేయించుకుని బ్యాంకు నుంచి రూ.70వేలు డ్రా చేసుకున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. పైగా ఎందుకు డ్రా చేసుకున్నావని అడిగితే అతను గొడవకు దిగుతున్నాడని, దుర్భాషలాడుతున్నాడని బాధితురాలు, ఆమె భర్త సీఐకు వివరించారు. తనకు జరిగిన అన్యాయంపై విచారించి డబ్బు తనకు ఇప్పించేలా చూడడం, తనను మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది. సీఐ మాట్లాడుతూ విచారణ చేపట్టి బాధితురాలికి న్యాయం చేస్తామని ఆవేదన చెందవద్దన్నారు. బ్యాంకు లావాదేవీలు జరపాలంటే బ్యాంకు సిబ్బంది, లేదా కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాలే తప్ప బయటి వ్యక్తులను ఆశ్రయించవద్దని సీఐ హెచ్చరించారు.

హోం మినిస్టర్‌పై ట్రోల్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కడప (క్రైం), ఆగస్టు 24: హోం మినిస్టర్ వంగలపూడి అనితను సోషల్ మీడియాలో ట్రోల్ చేసిన వ్యక్తిపై చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఇటీవల హోం మినిస్టర్‌కు వ్యతిరేకంగా ప్రచార మాధ్యమాల్లో వీడియోలు ట్రోల్ చేస్తుండడంతో టీడీపీ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పంచాయతీలను నిర్వీర్యం చేసిన వైసీపీ

వేంపల్లె, ఆగస్టు 24: పంచాయతీలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి అన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి పంచాయతీలను నిర్లక్ష్యం చేసిందన్నారు. వేంపల్లెలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించడం, గ్రామ సభల్లో ఉపాధి హామీపథకం పనులకు ఆమోదం తీసుకోవడం, గ్రామ పంచాయతీలకు రూ.2500కోట్లు విడుదల చేయడం ముదావహమన్నారు. నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

నీట్ పీజీలో దివ్యకు 178వ ర్యాంకు



జమ్మలమడుగు, ఆగస్టు 24: స్థానిక ఓంశాంతివీధి వాసి మైలవరం ఈఓపీఆర్‌డీ వై.రామచంద్రారెడ్డి, వైశ్రీదేవి కుమార్తె వై.దివ్యప్రీతి నీట్ పీజీలో 178వ ర్యాంకు సాధించి ప్రతిభ కనపరిచినది. ఈనెల 11న జరిగిన నీట్ పీజీ (నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సు) ఎంపిక పరీక్ష జరిగింది. ఈ పరీక్షలో వై.దివ్యప్రీతి జాతీయస్థాయిలో 178వ ర్యాంకు సాధించినట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఈ పరీక్షకు దేశంలోని సుమారు 2.40 లక్షల మంది వైద్య విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ప్రతిభ కనపరిచిన డాక్టర్ వై.దివ్యప్రీతి ఎంబీబీఎస్ కోర్సు కర్నూలు మెడికల్ కళాశాలలో చదివింది. నీట్ పరీక్షలో ప్రతిభ కనపరిచినందుకు తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తేజేశ్వర్‌కు స్టేట్ 50వ ర్యాంక్



కాశినాయన ఆగస్టు:24: ఉప్పలూరు రైతు బిడ్డ పాలకొలను తేజేశ్వర్ శుక్రవారం విడుదలైన మెడిసిన్ పీజీ ఫలితాల్లో ఆల్‌ఇండియాలో 2900 ర్యాంక్, స్టేట్‌లో 50వ ర్యాక్ సాధించాడు. ప్రభుత్వ కాలేజీలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ వస్తుందని ఆశాభావం వ్యక్తచేశారు. సామాన్య రైతు కుటుంబీకుడు పాలకొలను రమణారెడ్డి ఇంద్రావతి దంపతుల మొదటి కుమారుడు తేజేశ్వర్‌రెడ్డి మెడిసిన్ ఫ్రీసీట్ సాధించి హైదరాబాద్‌లోని మేడ్చల్ మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. వీరి రెండో కుమారుడు కూడా ఎంబీబీఎస్ ఫ్రీసీట్ సాధించి కుప్పంలో చదువుతున్నాడు. ఇద్దరు కొడుకులు డాక్టర్లు కావడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. ఉప్పలూరులో ఒకరు మెడిసిన్ పీజీ, మరొకరు పీజీలో ర్యాంక్ సాధించారు. మరో ముగ్గురు విద్యార్థులు ఎంబీబీఎస్ చదువుతుండడం విశేషం. తేజేశ్వర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ పట్టాను అందుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కానిస్టేబుల్‌కు గాయాలు



గాయపడిన కానిస్టేబుల్ కృష్ణయ్య

రామాపురం, ఆగస్టు24: ఆంజనేయస్వామి గుడి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బెటాలియన్ కానిస్టేబుల్ రేఖం కృష్ణయ్యకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... కడప టౌన్‌లో నివాసముంటున్న కృష్ణయ్య తన స్వగృహం కొత్తపల్లికి బైక్‌లో వచ్చి బంధువులను కలిసి మాట్లాడి తిరిగి కడపకు వెళ్తుండగా గువ్వలచెరువు సమీప ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ సంఘటనలో కానిస్టేబుల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. రామాపురం ఎస్ఐ సిబ్బందితో చేరుకుని తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

మైలవరం, ఆగస్టు 24: అప్పుల బాధ తాళలేక అయ్యవారిపల్లి రైతు చిట్టిబోయిన క్రిష్ణయ్య (50) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు క్రిష్ణయ్య రెండెకరాల పొలంలో జీవనం సాగించేవాడని వర్షాలు లేక సమయానికి పంట సాగు చేసిన పంటలు పండక పలువురి వద్ద దాదాపు రూ.15 లక్షలకు పైగా అప్పు చేశాడని, తన కుమారులను బీటెక్ చదివించాడని వారికి ఉద్యోగాలు రాక పోవడంతో అప్పు తీర్చలేనని భయంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో గడ్డి మందు తాగి ఇంట్లో పడిపోయి ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జమ్మలమడుగుకు హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన చికిత్సల కోసం కర్నూల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించిన జేసీ



పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

మైదుకూరు రూరల్, ఆగస్టు 24: శెట్టివారిపల్లె రెవెన్యూ పొలంలో ఫ్రీహోల్డ్ ఆఫ్ అసైన్మెంట్ భూములను శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పరిశీలించారు. ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి డీకేటీ భూములను, వాటికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఆమెతో పాటు ఆర్‌డీఓ చంద్రమోహన్, తహసీల్దార్ రాజసింహనరేంద్ర తదితరులున్నారు.

క్రైస్తవ ఆస్తులను అమ్మే హక్కు ఎవరికీ లేదు

క్రైస్తవ రక్షణ కమిటీ నేత కే.దేవానంద్



సమావేశంలో మాట్లాడుతూన్న క్రైస్తవులు

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 24: రాయలసీమ జిల్లాల్లో ఉన్న ఎస్‌పీఎల్‌సీ చర్చి ఆస్తులను అమ్మే హక్కు ఎవరికీ లేదని క్రైస్తవ రక్షణ కమిటీ నేత కే.దేవానంద్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌పీఎల్‌సీ చర్చిలో క్రైస్తవులు నిర్వహిస్తున్న నిరాహార దీక్షలో పాల్గొన్ని వారికి ధైర్యం చెప్పారు. పట్టణంలో ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా కూల్చిన చర్చి బంగ్లా గోడను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ జయరావు, విజయ్ కుమార్ వర్గాలకు చర్చి ఆస్తులు అమ్మే హక్కు లేదని స్పష్టం చేశారు. కలెక్టర్ చొరవ తీసుకుని మిషనరీ ఆస్తులను కాపాడాలని కోరారు. త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి క్రైస్తవ ఆస్తులను రక్షించాలని విన్నవించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వేడుక రాజరత్నం, కూని చంద్రయ్య, భాస్కర్, సంతోష్, జోసఫ్, మరి కొందరు రిలే నిరహర దీక్షలో పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



రమణయ్య (ఫైల్)

అట్లూరు, ఆగస్టు 24: కొండూరు బీసీ కాలనీ వాసి బత్తుల రమణయ్య (45) శనివారం తెల్లవారు జామున బాకరాపేట సమీప రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఛిద్రమైనట్లు బంధువులు తెలిపారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రమణయ్య, బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడని శుక్రవారం ఉదయం బేల్దారి పనికి తిరుపతికి పోతున్నట్లు భార్య తిరుపాలమ్మకు చెప్పా డు. సాయంత్రం వరకు తిరుపతికి చేరకపోవడంతో భార్య ఆందోళనతో విషయానికి బంధువులకు తెలిపింది. శనివారం ఉదయం రైలు కింద పడి మృతి చెందినట్లు అతని దగ్గర ఉన్న ఫోన్‌బుక్‌లో ఫోను నెంబర్లతో రైల్వేసిబ్బంది వెంకటసుబ్బయ్యకు ఫోను చేయగా రమణయ్య మృతి చెందినట్లు భార్య తిరుపాలమ్మకు తెలిపారు. రమణయ్య మృతదేహాన్ని బంధువులు కొండూరుకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి ఒక కూతురు కొడుకు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



రామలక్షుమ్మ మృతదేహం

ముద్దనూరు ఆగస్టు24: స్థానిక హోసన్న చర్చి వద్ద ప్రమాద వశాత్తు బైకుపై నుంచి పడి గాయపడి చికిత్స పొందుతున్న రామలక్షుమ్మ (51) శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. భాగ్యనగర్ కాలనీ వాసి రామలక్షుమ్మ ఆమె కుమారుడుతో కలిసి గురువారం బైకుపై ఎర్రగుంట్లకు వచ్చి తిరిగి జమ్మలమడుగుకు వెళుతున్నారు. హోసన్న చర్చి వద్ద బైకు చక్రంలో చీరె కొంగు ఇరుక్కోవడంతో ప్రమాదవశాత్తు రోడ్డుపై పడి తీవ్రగాయాలపాలైంది. వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు జనరల్ ఆస్పత్రికి తరలిస్తే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్లానింగ్ సెక్రటరీపై వేటు

బద్వేలుటౌన్, ఆగస్ట 24: అనధికార నిర్మాణాలను ఆపడంలో నిర్లక్ష్యం వహించినందుకు వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ బయ్యారపు శేఖర్‌ను సస్పెండ్ చేశారు. బద్వేలు పురపాలక సంఘం మడకలవారిపల్లె గ్రామం గోపవరం మండల ప్రభుత్వ స్థలం సర్వేనెంబర్ 973/3లో 2.34ఎకరాల స్థలం ఉంది. ఇందులో చేపడుతున్న అనధికారిక నిర్మాణాలను అడ్డుకోవడంలో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ విధుల్లో నిర్లక్ష్యం వహించాడు. ఈవిషయమై సీసీఏ రూల్స్ 1991 మేరకు కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ సస్పెండ్ చేశారు.

ఏపీఓను తిట్టారని కేసు నమోదు

కొండాపురం, ఆగస్టు 24: వెంకయ్యకాలువ గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఏపీఓను తిట్టినందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామసభలో ఉండగా తిరుమల మారుతి కుమార్ అసభ్యకరంగా దూషించాడని ఏపీఓ సుబ్బమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు మారుతికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు

డీఈఓకు ఉద్యోగ సంఘం అధ్యక్షుడు వినతి

కడప(కలెక్టరేట్) ఆగస్టు24: అట్లూరు మండలం, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ జి.ఫణీ శ్రీని కొందరు మండల నేతలు రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు చేసి వేధించడం తగదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం డీఈఓ అనురాధను కలసి వినతి పత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ ఈవిద్యా సంవత్సరం ప్రారంభం నుంచీ విద్యాకమిటీ ఎన్నికల తరువాత ఆమెపై రాజకీయ వత్తిడులు పెరిగాయన్నారు. వాస్తవాలు పరిశీలించి న్యాయం చేయాలని డీఈఓను కోరారు.

పోటీతత్వం కలిగి ఉండాలి : జేసీ



విద్యార్థికి జ్ఞాపిక అందిస్తున్న జేసీ అదితిసింగ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 24: ప్రతి విద్యార్థి పోటీతత్వం కలిగి ఉండాలని జేసీ అదితిసింగ్ అన్నారు. నేషనల్ స్పేస్‌డే సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ ఆధ్వర్యంలో చంద్రయాన్-3పై విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో న్యూమాడల్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. వారికి జేసీతో కలిసి డీఈఓ అనురాధ బహుమతి అందించారు. హైస్కూలు ఏఓ షర్మిల, విజయ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పీరు లభ్యం

చిట్వేలి, ఆగస్టు 24: ఎల్లమరాజుచెరువులో పురాతన రాగితో చేసిన పీరు దొరికింది. శనివారం చెరువులో క్రికెట్ ఆడుతున్న యువతకు పీరు దొరకడంతో తోపుల వీధిలోని పీర్లచావిడికి తెచ్చి పూజలు చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పీరును చూడడానికి తండోపతండాలు చావిడికి విచ్చేశారు. మొహర్రం వేడుకలు 40 రోజులు పూర్తయిన సమయంలో ఈ పీరు దొరకడం శుభసూచకమని ముస్లింలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పీరు దాదాపు 200 ఏళ్ల చరిత్ర కలిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. పీరుకు ప్రత్యేక పూజలు చేశారు.

అధిక రేట్లకు అమ్మితే సీజ్ చేస్తాం

- డీబీటీ చేసి రైతులకు ఎరువులు ఇవ్వాలి : జేడీ



పంటలను పరిశీలిస్తున్న జేడీ

ఖాజీపేట, ఆగస్టు 24: అధిక రేట్లకు ఎరువులను అమ్మితే దుకాణాలు సీజ్ చేస్తామని జేడీ నాగేశ్వరరావు అన్నారు. శనివారం తుడమలదిన్నెలో పత్తిపంటను పరిశీలించారు. అనంతరం ఖాజీపేటలోని ఎరువు దుకాణాలు ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసిన పంటను శ్లాబ్‌బుకింగ్ చేసుకోవాలని, పొలం చుట్టూ పసుపు రంగు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి దుకాణదారుడు డీబీటీ తప్పనిసరిగా చేయాలని, జిల్లా నుంచి వచ్చిన రిపోర్టు, ఇక్కడ ఉన్న స్టాకు సరిపోయిందన్నారు. డీబీటీ చేయకపోతే జిల్లాకు ఎరువులు రావని, ఎరువులు సకాలంలో అందాలంటే డీబీటీ తప్పనిసరన్నారు. ఎరువులు కొన్న ప్రతి రైతు బిల్లులు తీసుకోవాలని, అధిక రేట్లకు ఎరువులు అమ్మితే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. యూరియా రూ.267 మాత్రమే చెల్లించాలని, ఎక్కువ ధరకు అమ్మినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగార్జున, వీఏఏ జమాలమ్మ, సర్పంచ్ క్రిష్ణారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భారీ స్కోరు దిశగా చిత్తూరు - ఎదురీదుతున్న నెల్లూరు

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 24: కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 23 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా వివిధ జట్ల మధ్య సాగుతున్న మూడురోజుల క్రికెట్ మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 395 పరుగుల భారీ స్కోరు దిశగా సాగుతోంది. మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 172 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది. వివరాలిలా..

కేఎస్ఆర్ఎం మైదానంలో...

నగరశివారు ప్రాంతజ కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో శనివారం చిత్తూరు - కడప జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గి చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 395 పరుగులు చేసింది. ఇందులో వై.తేజారెడ్డి 122 పరుగులు (136 బాల్స్) సాధించారు. వీరి తో పాటు మరో బ్యాట్స్‌మెన్ ధరణికుమార్‌నాయుడు 60 పరుగులు చేయగా, కె.నిఖిత్ (బ్యాటర్) 60 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. బౌలింగ్‌లో కడప జట్టు బౌలర్ ఆదిల్‌హుసేన్ 3 వికెట్లు సాధించారు.

ఏసీఏ మైదానంలో...

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు - కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్‌నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్ చేపట్టి తొలి ఇన్నింగ్స్‌లో 62.0 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో ఎ.సాయిసూర్యతేజారెడ్డి 92 పరుగులు చేయడం విశేషం. తదనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 87 పరుగులతో ఎదురీదుతోంది. ఇందులో భార్గవ్ 23 పరుగులతో, ఫర్హత్ ఖాద్రి 18 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో నెల్లూరు జట్టు మరో 172 పరుగుల లోటుతో ఎదురీదుతోంది.



తేజారెడ్డి (చిత్తూరు)



కె.నిఖిత్ (చిత్తూరు)



సూర్యతేజరెడ్డి (కర్నూలు)

31న రాజనాలబండ తిరునాళ్లు


తిరునాళ్లు గురించి మాట్లాడుతున్న టీటీడీ ఏఈవో మునికృష్ణారెడ్డి

చౌడేపల్లె, ఆగస్టు 24: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో ఈనెల 31, సెప్టెంబరు ఒకటో తేదీన తిరునాళ్ల నిర్వహించనున్నట్లు టీటీడీ ఏఈవో మునికృష్ణారెడ్డి తెలిపారు. ఆలయ నిర్వాహకులు, పరిసర గ్రామాల ప్రజలు, పెద్దలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. రాజనాలబండ ఆలయం టీటీడీ అధీనమైన తర్వాత జరిగే మొదటి తిరునాళ్ల కావడంతో గతంలో కన్నా ఇంకా ఘనంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు. సంప్రదాయబద్ధంగా, ఆనవాయితీగా వచ్చే కార్యక్రమాలు, ఊరేగింపులు అలానే కొనసాగుతాయన్నారు. తిరునాళ్లలో ఏయే గ్రామాలు చేసే పనులు వారే చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి కొండ చిలువ



పెనుమూరు, ఆగస్టు 24: మండలంలోని సీఎస్ అగ్రహారం గ్రామ సమీపంలోకి కొండ చిలువ వచ్చింది. రైతు మురుగన్ గమనించి, గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి చేరుకుని పామును కొట్టి చంపారు. నెల రోజుల్లో రెండవసారి కొండ చిలువ కనిపించడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలపై సమీక్ష


ఎస్సీ, ఎస్టీ పార్లమెంటరీ సంక్షేమ కమిటీ సమావేశంలో దగ్గుమళ్ల

చిత్తూరు సిటీ, ఆగస్టు 24: ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శనివారం ఢిల్లీలో ఎస్సీ, ఎస్టీ పార్లమెంటరీ సంక్షేమ కమిటీ సమావేశం జరిగిందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలు, వాటికి ప్రభుత్వం ఏ మేరకు సహకరిస్తుంది అనే అంశాలపై సమీక్షించామని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తింపజేస్తున్నారా.. రోస్టర్ విధానం అమలవుతోందా... లేదా.. అన్న విషయాలపై కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారని తెలిపారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

బండరాయి పడి హిటాచీ డ్రైవర్ మృతి


బాలెందర్ (ఫైల్ ఫొటో)

గుడిపాల, ఆగస్టు 24: బండరాయి పడి హిటాచి డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని అరుళ్ పురం చర్చి వద్ద శనివారం చోటుచేసుకుంది. హైవే పనుల నిమిత్తం హిటాచీతో పెద్దరాళ్లను తీసుకొచ్చి దొర్లిస్తుండగా అందులో ఒకటి డ్రైవర్ బాలెందర్ (24)పై పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వాడని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి జాతీయ క్రీడా దినోత్సవం

చిత్తూరు రూరల్, ఆగస్టు 24: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధ్వర్యంలో ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 26న ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 27న విద్యార్థులతో ప్రతిజ్ఞ, 9, 10 తరగతి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. 28న 18-60 వయస్సున్న వారికి క్రీడా పోటీలు నిర్వహించాలని తెలిపారు. 29న ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నివాళి అర్పించాలని సూచించారు. 30న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ క్రీడాకారులకు సన్మానం చేయాలని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో 'సరిపోదా శనివారం'


ఆలయం ముందు నాని, ప్రియాంక

'సరిపోదా శనివారం' చిత్ర హీరో నాని, హీరోయిన్ ప్రియాంక మోహన్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈనెల 29వ తేదీన ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో వీరు శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. రాత్రి తిరుమలలోనే బస చేసి శనివారం ఉదయం నాని దంపతులతోపాటు ప్రియాంక ఆలయంలోకి వెళ్లి తిరుమలేశుడి సేవలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

జాప్యం లేకుండా భక్తులకు దర్శనం

అదనపు ఈవో వెంకయ్య ఆదేశం

తిరుమల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కంపార్టుమెంట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా భక్తులను దర్శనానికి అనుమతించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం తెల్లవారుజామున తిరుమలలో ఆయన విస్తృత తనిఖీలు చేశారు. ముందుగా వైకుంఠం క్యూకాంప్లెక్స్-1, కృష్ణతేజ సర్కిల్, నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు, క్యూలైన్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై ఆయన భక్తులకు అవగాహన కల్పించారు. కంపార్టుమెంట్లలో వడ్డించిన ఉప్మా చాలా రుచికరంగా ఉందని భక్తులు అదనపుఈవోకు చెప్పి ఆనందాన్ని వ్యక్తం చేశారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో తాగునీరు, అన్నప్రసాదాలు, పాలు అందించే విధానాన్ని పరిశీలించి, కంపార్టుమెంట్ల వెలుపల ఉన్న బోర్డులపై భక్తులకు అందించే ఆహార పానీయాలు, సమయాలను పేర్కొనాలని అధికారులను ఆదేశించారు. కంపార్టుమెంట్లలో మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. కృష్ణతేజ సర్కిల్ వద్ద భక్తులు క్యూలైన్‌లోకి ప్రవేశించే మార్గాల వద్ద కొందరు ప్రైవేట్ ట్యాక్సీ, జీప్ డ్రైవర్లు అడ్డంగా పార్కింగ్ చేయడాన్ని గమనించి, డ్రైవర్లను హెచ్చరించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి అనధికారిక పార్కింగ్ నివారించేందుకు, స్థానిక పోలీసులతో చర్చలు జరపాలని టీటీడీ విజిలెన్స్ అధికారులను వెంకయ్య చౌదరి ఆదేశించారు.

హరియాణా ముఠా అరెస్టు

అనంత, చిత్తూరు, కర్ణాటకలో ఏటీఎంలలో చోరీలు

అర కోటికి పైగా మాయం.. రూ.2 లక్షలే రికవరీ

పట్టుబడింది ఐదుగురు.. పరారీలో ఏడుగురు




పట్టుబడిన దొంగల ముఠా సభ్యులు - స్వాధీనం చేసుకున్న నగదు, ఆయుధాలు, సామగ్రి - పట్టుబడిన లారీ

అనంతపురం క్రైం, ఆగస్టు 24: ఏటీఎంలలో చోరీలకు పాల్పడుతున్న హరియాణా దొంగల ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లో రూ.అర కోటికి పైగా డబ్బు చోరీ చేసిన చేసిన వీరి నుంచి రూ.2లక్షలు మాత్రమే పోలీసులు రికవరీ చేశారు. ఈ ముఠాను పట్టుకునేందుకు అనంతపురం నగరంలోని నాలుగు పోలీస్‌స్టేషన్ల సీఐలు, సీసీఎస్, స్పెషల్ బ్రాంచ్, టెక్నికల్ స్టాఫ్, కర్ణాటక పోలీసులు శ్రమించారు. మొత్తం 12 మంది సభ్యులున్న ముఠాలో ఐదుగురు దొరికారు. మిగిలినవారు పరారీలో ఉన్నారు. ఈ కేసు వివరాలను ఎస్పీ జగదీష్ శనివారం డీపీఓలో వెల్లడించారు.

అరెస్టయింది వీరే..

హరియాణాలోని సుహ్ జిల్లా అలీమియో గ్రామానికి చెందిన రాబిన్, ఘసేరాకు చెందిన సలీం, రోజ్ కామియో గ్రామానికి చెందిన హక్కాఖాన్, అలీమియో గ్రామానికి చెందిన షాకీర్, రాజస్థాన్‌లోని భరత్ పుర జిల్లా అల్‌గని గ్రామానికి చెందిన మజీద్ అరెస్టు అయ్యారు. వసీం, సద్దాం, టౌసిఫ్, రాహుల్, హర్షద్, వారీష్, అతావుల్లా పరారీలో ఉన్నారు.

ఇవీ చోరీలు..

ఈ నెల 8న అనంతపురం నగరంలోని రామ్‌నగర్ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేశారు. ప్రస్తుతం అరెస్టయిన ఐదుగురు, పరారీలో ఉన్న ఏడుగురు అక్కడికి వెళ్లారు. పోలీసులు, స్థానికులు గమనించకుండా ఎనిమిది మంది ఏటీఎం వద్ద వలయంగా ఏర్పడ్డారు. గ్యాస్ కట్టర్ నిపుణుడు సద్దాం సహా నలుగురు ముఖాలకు ముసుగులేసుకుని ఏటీఎం మిషన్‌ను కట్ చేశారు. అందులో ఉన్న రూ.29.80 లక్షలను ఎత్తుకెళ్లారు. ఇదే తరహాలో ఈ నెల 2న కల్లూరు ఎస్బీఐ ఏటీఎంలో రూ.3,26,600, జూన్ 7న కూడేరు మండల కేంద్రంలో రూ.18,41,300 ఏటీఎంలలో చోరీ చేశారు. ఫిబ్రవరి 8న అనంతపురం నగరంలోని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి నగదు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీస్‌సైరన్ రావడంతో పారిపోయారు. కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపూర్‌లో ఏటీఎం సెంటర్‌లో రూ.18,24,500 చోరీ చేశారు. చిత్తూరు జిల్లా గుడిపాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటీఎం సెంటర్లో రూ.25,98,400 చోరీ చేశారు.

అరెస్టు ఇలా..

అనంతపురం జిల్లాలో వరుసగా ఏటీఎంలలో చోరీలు జరగడంతో అప్పటి ఎస్పీ కేవీ మురళీకృష్ణ, నూతన ఎస్పీ జగదీష్ కేసులను ఛేదించాలని ఆదేశించారు. డీఎస్పీ టీవీవీ ప్రతాప్ ఆధ్వర్యంలో సీఐలు ఇస్మాయిల్, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, శివరాముడు, షేక్ జాకీర్, సాయినాథ్, ఎస్ఐలు నాగమధు, గౌస్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో హెచ్‌సీలు శివయ్య, మల్లికార్జున, నాగరాజు, కానిస్టేబుళ్ళు రంజిత్, దాస్, ఆసిఫ్, ప్రసాద్, అనిల్, ఫరూక్, బాలు, ఓబుళేసు, వెంకటరమణ బృందాలుగా ఏర్పడ్డారు. ముఠాలోని ఐదుగురిని అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి క్రాస్ సర్వీస్ రోడ్డు పక్కన పొదలలో అరెస్టు చేశారు. నిందితుల నుంచి గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, 5 సెల్‌ఫోన్లు, రూ.2లక్షల నగదు, 3 ఇనుప రాడ్లు, ఒక బాకు, కారం పొడి ప్యాకెట్, శానిటైజర్ స్ప్రే బాటిల్, పెయింట్ స్ప్రేలు, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. డీజీపీ ద్వారకా తిరుమల రావు వీరిని అభినందించారు.

ముఠా నేపథ్యం ఇది..

ముఠాలో రాబిన్, సలీం కీలక నిందితులు. షాకీర్ ట్రక్ డ్రైవర్. హరియాణా నుంచి బెంగళూరు హైవే మీద ప్రయాణిస్తూ.. ఏటీఎం కేంద్రాలు, అక్కడి భద్రత, సీసీ కెమెరాలు, రద్దీని గుర్తిస్తాడు. సులువుగా దొంగతనాలు చేసేందుకు అనువుగా ఉన్న ఏటీఎం కేంద్రాలను ఎంపిక చేసి.. రాబిన్, సలీంకు సమాచారం చేరవేస్తాడు. గ్యాస్ కటింగ్‌లో అనుభవమున్న సద్దాంతో రాబిన్ చర్చించి.. మిగిలిన సభ్యులను సమీకరించుకుంటాడు. అనంతరం ముఠా సభ్యులు నకిలీ నంబర్లతో రెండు కార్లలో ఎంపిక చేసుకున్న ఏటీఎం కేంద్రాలకు వస్తారు. ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో.. అర్ధరాత్రి 2 గంటల నుంచి తెల్లవారు జామున 4 గంటల మధ్యలో చోరీ చేస్తారు. చోరీ చేసిన సొమ్ములో కొంత మొత్తాన్ని ముఠా సభ్యులకు ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని రాబిన్ తన వద్దే ఉంచుకుంటాడు. హరియాణా వెళ్లాక వాటాలు వేసుకుంటారు. ఎస్‌బీఐ ఏటీఎంలలో ఎక్కువ నగదు ఉంటుందని.. వాటినే ఎక్కువగా చోరీలకు ఎంచుకుంటారు. చిత్తూరు జిల్లా గుడిపాల ఏటీఎం చోరీలో కేసులో రాబిన్, సద్దాం, టౌసిఫ్ నిందితులు.

మొదలైంది



- తిరుపతిలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై సీఐడీ విచారణ
- పలు ఫైళ్ల స్వాధీనం
- సహకరించని అధికారులు?

తిరుపతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో జరిగిన ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణంపై సీఐడీ అధికారులు విచారణ మొదలుపెట్టారు. శనివారం నలుగురు సీఐడీ అధికారుల బృందం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లింది. పట్టణ ప్రణాళిక విభాగంలో పలు డాక్యుమెంట్లను పరిశీలించారు. టీడీఆర్ బాండ్ల అవకతవకలపై వివరాలు సేకరించారు. స్థల సేకరణలో ఎకరాల్లో గుర్తించి, బాండ్ల జారీకి చదరపు గజాల్లో లెక్కించినట్టు, అగ్రికల్చర్, రెసిడెన్షియల్ పరిధిలోని స్థలాలను కూడా కమర్షియల్‌గా రిజిస్ట్రేషన్ విలువ పెంచేసి భారీగా లబ్ధిపొందినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్టు సమాచారం. మరింత లోతుగా విచారించేందుకు తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో ఒక గదిని ఏర్పాటు చేయాలని సీఐడీ బృందం మున్సిపల్ ఉన్నతాధికారులను అడిగినట్టు తెలిసింది. అయితే టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డి.. సీఐడీ అధికారుల బృందం వచ్చే సమయంలో కార్యాలయం నుంచి ఉద్దేశపూర్వకంగానే వెళ్లిపోయినట్టు సమాచారం. దీంతో కిందిస్థాయి సిబ్బందితో మాట్లాడి పలు ఫైళ్లను తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే తిరుపతి కార్పొరేషన్లో డిప్యుటేషన్‌పై పనిచేసిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రహ్మణ్యంపై పదిరోజుల క్రితం ప్రభుత్వం బదిలీ వేటు వేసిన విషయం తెలిసిందే. తిరుపతి ఏసీపీగా డిప్యుటేషన్ రద్దు చేస్తూ రాజంపేట మున్సిపాల్టీ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో)గా బదిలీచేశారు. అయితే అక్కడ బాధ్యతలు స్వీకరించకుండా తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ప్లానింగ్ విభాగంలో చేరేందుకు బాలసుబ్రహ్మణ్యం చక్రం తిప్పుతున్నట్టు తెలుస్తోంది. ఆయనకు తుడా ప్లానింగ్ విభాగంలో పోస్టింగ్ ఇవ్వాలని తిరుపతి, చంద్రగిరి కూటమి ఎమ్మెల్యేలు కూడా సిఫారసు లేఖలు అందజేసినట్టు సమాచారం. ఓవైపు టీడీఆర్ బాండ్ల అక్రమాలను నిగ్గు తేల్చాలని టీడీపీ నేతలు ఆనం వెంకటరమణారెడ్డి, రవినాయుడు అధిష్టానానికి ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి విచారణకు ఆదేశిస్తే, మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను తిరిగి తెప్పించుకునేందుకు కూటమి ఎమ్మెల్యేలే సమర్థించడం విమర్శలకు తావిస్తోంది.

బాలికను వేధించిన యువకుల అరెస్టు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 24: మండలానికి చెందిన బాలిక(14) వెదురుకుప్పం మండలంలోని ఓ ఉన్నత పాఠశాలలో చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన అంబేద్కర్ (26) రవింద్ర(23) ఆమెను వేధిస్తుండడంతో పాఠశాలకు వెళ్లడం మానేసింది. తల్లిదండ్రులు ఆరా తీయడంతో విషయం బయటపడింది. ఆమె తండ్రి యువకులను నిలదీయడంతో రాడ్‌తో దాడి చేశారు. గాయపడిన బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని కార్వేటినగరం సీఐ హనుమంతు తెలిపారు.

రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్

అనుచరులతో కలిసి ఓ కుటుంబంపై దాడి ● ఇద్దరికి గాయాలు


గాయపడ్డ చంద్రబాబు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 24: తిరుపతి పరిసర ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. తాజాగా ఓ బ్యాచ్ ఇంటిమీద దాడిచేసి ఇద్దరిని గాయపరిచింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటకు చెందిన టీడీపీ నేత చంద్రబాబు నాయుడు తన భార్య మల్లికతో కలిసి పది రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. మల్లంగుంట వినాయకనగర్‌కు చెందిన రౌడీషీటర్ కుల్లా అలియాస్ వెంకటేష్, తన అనుచరులు కొందరు ఉప్పరపల్లె చెక్‌పోస్టు వద్ద రోడ్డుకు అడ్డంగా కారు ఆపి మద్యం తాగుతున్నారు. కారు అడ్డం తొలగించమని వారిని చంద్రబాబు కోరారు. మద్యం మత్తులో ఉన్నవారు తిరస్కరించారు. చేసేదేమీలేక పక్క నుంచి వెళుతుండగా కారుతో ఢీకొట్టారు. ఆ ప్రమాదం నుంచి తప్పించుకుని ఎలాగోలా చంద్రబాబు దంపతులు ఇంటికి చేరుకున్నారు. వారం తర్వాత వెంకటేష్, అతడి అనుచరులు డిల్లీ, హరి, ఈశ్వర్‌తోపాటు మరి కొందరితో చంద్రబాబు ఇంటి ముందుకొచ్చి భారీ ఎత్తున టపాసులు కాలుస్తూ దుర్భాషలాడారు. ఈనేపథ్యంలో వారు మళ్లీ శుక్రవారం అర్ధరాత్రి చంద్రబాబు ఇంటికొచ్చి బయటకు రావాలంటూ కేకలేశారు. చంద్రబాబు, ఆయన భార్య మల్లిక, అమ్మ శాంతమ్మ ఇంటి తలుపుతీసి బయటికొచ్చారు. ఏంటని అడిగేలోపే.. ఖాళీ బీరు బాటిళ్లతో చంద్రబాబు, ఆయన భార్యపై దాడిచేశారు. చంద్రబాబు తీవ్రంగా గాయపడగా, మల్లికకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు శనివారం తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిని చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ షేక్ షావలి తెలిపారు. దాడి చేసిన కుల్లాపై ఇదివరకే రౌడీషీట్ ఉందని.. అతడితోపాటు అనుచరులను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

అక్టోబరు 4 నుంచి 12 వరకు
అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు - టీటీడీ ఈవో



తిరుమల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మంతో కలిసి ఆయన టీటీడీలో అన్ని విభాగాల అధికారులతో తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ.. పెరటాశి(తిరుమల శనివారాలు) మాసం కూడా జతకానున్న నేపథ్యంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, టీటీడీలోని అన్ని విభాగాల అధికారులు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. 4వ తేదీన ధ్వజారోహణం ఉంటుందని, ఆరోజున సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. ఉదయం 8నుంచి 10 గంటల వరకు, రాత్రి 7నుంచి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయని తెలిపారు. గరుడ వాహనసేవ మాత్రం సాయంత్రం 6.30 గంటలకు మొదలవుతుందన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా తిరుమల శ్రీవారి ఆలయంలో పలు ఆర్జితసేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు చేశామని తెలిపారు. సుమారు ఏడు లక్షల లడ్డూల బఫర్ స్టాక్‌ను ఉంచుతామన్నారు. టీటీడీ విజిలెన్స్, జిల్లా పోలీసులతో పటిష్ట భద్రతాఏర్పాట్లు చేస్తామన్నారు. గరుడసేవకు ప్రత్యేకంగా అదనపు భద్రతను కల్పిస్తామన్నారు. నిత్యం కామన్ కమాండ్ సెంటర్ ద్వారా భద్రతను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల, తిరుపతిలో ఇంజనీరింగ్ పనులు వేగంగా చేస్తున్నామని, భక్తులకు ఆకట్టుకునేలా విద్యుత్ అలంకరణలు ఉంటాయన్నారు. వాహనసేవలు వీక్షించేందుకు మాడవీధుల్లో గ్యాలరీలు, పెద్ద డిజిటల్ స్క్రీన్లు ఏర్పాట్లు చేస్తామన్నారు. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు కాటేజీల దాతలకు గదుల కేటాయింపు రద్దు చేసినట్టు వెల్లడించారు. తిరుమలలో వసతి లభించని భక్తులు తిరుపతిలోనే బస పొందాలన్నారు. కల్యాణకట్ట, మినీకల్యాణకట్టల్లో క్షురకులు నిరంతరాయంగా భక్తులకు సేవలందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి అదనపు సిబ్బంది ఏర్పాటు చేసినట్టు వివరించారు. నిరంతరాయంగా అన్నప్రసాదాల వితరణ జరుగుతుందన్నారు. సరిపడ వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. బ్రహ్మోత్సవాల్లో దాదాపు 4 వేల మంది శ్రీవారి సేవకులు సేవలందిస్తారని తెలిపారు. ఎప్పటిలానే ఫొటో ఎగ్జిబిషన్, ఫల పుష్ప ప్రదర్శనశాల, ఆయుర్వేద, శిల్ప ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కళాబృందాలు వచ్చి వాహనసేవల్లో ప్రదర్శనలు ఇస్తాయని చెప్పారు. గరుడసేవ రోజున ఘాట్‌రోడ్డులో ద్విచక్రవాహనాల రాకపోకలను రద్దుచేశామన్నారు. అలిపిరి పాత చెక్‌పోస్టు, శ్రీవారిమెట్టు వద్ద ద్విచక్రవాహనాల పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేస్తామన్నారు. మాడవీధుల్లో కార్నర్ పాయింట్స్‌లో అదనంగా భక్తులు వాహనసేవలు దర్శించే అంశంపై పరిశీలన చేస్తామని ఓ ప్రశ్నకు ఈవో బదులిచ్చారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ని కలిసిన జనసేన నేత


డిప్యూటీ సీఎంతో జనసేన నేత సాయినాథ్

ములకలచెరువు, ఆగస్టు 24: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ కలిశారు. రైల్వేకోడూరులో శుక్రవారం జరిగిన గ్రామసభలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలిసి తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యల గురించి వివరించారు. అనంతరం పవన్ కళ్యాణ్‌ను ఆయన సన్మానించారు.

రేపు ధర్మపథంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం, ఆగస్టు 24: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం ఆలయంలో ఈనెల 26న సోమవారం ఉదయం షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాప అధ్యక్షుడు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. కల్యాణంలో పాల్గొనదలచిన భక్తులు ఆలయ నిర్వాహకులను సంప్రదించి వేడుకలలో పాల్గొన వచ్చన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

10లీటర్ల సారా స్వాధీనం.. విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లి, ఆగస్టు 24: గుట్టుచప్పుడు కాకుండా నాటుసారాను విక్రయిస్తున్న ఓ మహిళను పట్టుకొని అరెస్టు చేసి ఆమె నుంచి 10లీటర్ల సారాను స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తవళం పంచాయతి కుమ్మరపల్లికి చెందిన శాంతమ్మ(45) గ్రామ సమీపంలోని చింత చెట్టు కింద నాటుసారాను అమ్ముతుండగా అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 10లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. అనంతరం ఆమెపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

కేజీబీవీలో హెచ్ఐవీపై అవగాహన

సంబేపల్లె, ఆగస్టు 24: అవగాహనతో హెచ్ఐవీ బారిన పడ కుండా రక్షించుకోవచ్చని డీఆర్పీ అల్లావలి, ఎస్‌వో పద్మావతి అన్నారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కస్తూరిబాగాంధీ గురుకుల పాఠశాలలో శనివారం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చికిత్స కన్నా నివారణ మంచిదని తెలిపారు. లైంగిక సంపర్కాలు, కలుషితమైన సూదులు, సిరంజీలు, పరీక్షింపబడని రక్తం ద్వారా, హెచ్ఐవీ ఉన్న గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు ఈ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. ఆసుపత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయితే, ఉచి తంగా ఏఆర్‌టీ మందులు ఇస్తామన్నారు. అన్నమయ్య జిల్లాలో ఆగస్టు 12 నుంచి అక్టోబరు 12 వరకు 200 గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, లింక్ వర్కర్స్ స్కీమ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి రక్షణ కరవు

● ఇష్టారాజ్యంగా ద్విచక్రవాహనాల పార్కింగ్ ● రాత్రింబవళ్లు అపరిచితుల కదలికలు ● ఆందోళనలో మహిళా సిబ్బంది

బి.కొత్తకోట, ఆగస్టు24: బి.కొత్తకోట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు రక్షణ కరువైంది. గేటు వద్ద భద్రత లేకపోవడంతో ఎప్పుడు ఏంజరుగుతుందోనని ఆస్పత్రిలో పనిచేసే మహిళా సిబ్బందితోపాటు ఆస్పత్రికి రోగులకు తోడుగా వచ్చే మహిళలు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమబెంగాల్‌లో ట్రైనీ వైద్యురాలిపై పైశాచికదాడితో పాటు హత్యా సంఘటన నేపథ్యంతో దేశం యావత్తూ ఉలిక్కిపడింది. దీంతో ప్రతి రాష్ట్రం, జిల్లా, స్థానిక ఆసుపత్రులలో మహిళా వైద్యసిబ్బందికి రక్షణ ఏ మేరకు ఉందన్న చర్చ, పరిశీలన మొదలైంది. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మహిళా సిబ్బంది రక్షణపై ఆందోళన నెలకొంది. బి.కొత్తకోట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో 24గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. రాత్రి వేళల్లో సైతం మహిళాసిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. అయితే ఈ సిబ్బంది రక్షణపై అనేక అనుమానాలున్నాయి. ఆసుపత్రి భవనం నగరంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఉండటం, ప్రధానద్వారం వద్ద సెక్యూరిటీ లేకుండా పోవడంతో ప్రతిరోజూ వందలసంఖ్యలో ఆసుపత్రి ఆవరణలో ద్విచక్రవాహనాల పార్కింగ్ జరుగుతోంది. ఎప్పుడో ఉదయం నిలిపిన వాహనాలను ఎప్పుడు పడితే అప్పుడు తీసుకుని వెళ్లడంతోపాటే ఏ అర్ధరాత్రికో వచ్చి వెళుతున్న ఘటనలు నిత్యకృత్యం. మరోవైపు ఆసుపత్రి భవన సముదాయం లోంచి వెనుక వైపునున్న వీధిలోనికి దారిచేసుకొని అపరిచిత వ్యక్తులు రాత్రిళ్లు సంచారం చేస్తూనే ఉంటారు. ప్రధాన ద్వారం వద్ద సెక్యూరిటీ లేదు. ఆ ద్వారం ఎల్లప్పుడూ తెరచుకునే ఉంటుంది. దీంతో ఎవరు పేషెంట్ల తాలూకు వ్యక్తులో.. ఎవరు కాదో తెలుసుకునే వారూ..లేరు , తెలుసుకునే అవకావమూ లేదు. జరగరాని సంఘ టనలు ఏదైనా జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆసుపత్రి సిబ్బంది, పట్టణ ప్రజలు కోరుతున్నారు.


బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రిలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు

ఆస్పత్రిలో శాంతిభద్రతల బాధ్యత పోలీసులదే..

బి. కొత్తకోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో ద్విచక్ర వాహనాల నిలిపివేత, శాంతిభద్రతలు పోలీసు శాఖా వారిదేనని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ చీఫ్ కిరణ్ పేర్కొన్నారు. ఆస్పత్రి రక్షణ విషయం పోలీసులదే. ఇక ఆస్పత్రి ప్రధాన ద్వారం 24 గంటలు అత్యవసర పరిస్థితులలో రోగులు, ఇతర అంబులెన్స్‌లు వచ్చిపోవడానికి వీలుగా తెరిచే ఉంటుంది. ప్రధాన ద్వారం మూయడానికి వీలుండదు. ఇక ఆస్పత్రి ఆవరణలో ద్విచక్రవాహనాలు పెట్టకుండా చర్యలు తీసుకోవాల్సింది పోలీసుల పని. ఇందులో వైద్యులకు ఎలాంటి సంబంధం లేదు. కమ్యూనిటీ సెంటర్‌కు సెక్యూరిటీ తక్కువగా ఉండడంతో ఒక్కొక్కరే విధులు నిర్వర్తిస్తుండడంతో ఆస్పత్రికి ఎవరంటే వారు ఎప్పుడు పడితే అప్పుడు వస్తుంటే వారిని కంట్రోలు చేయడం కష్టంగానే ఉంటుందన్నారు.

ఉద్రిక్తల మధ్య మండల సమావేశం వాయిదా

కలికిరి, ఆగస్టు 24: కలికిరి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం తీవ్ర ఉత్కంఠ, ఉద్రిక్తతల నడుమ వాయిదా పడింది. సమావేశానికి ఎంపీపీ నూర్జహాన్, ఇతర సభ్యులు రాకపోవడంతో అధికారులు సమావేశాన్ని వాయిదా వేశారు. దాదాపు ఉదయం 10గంటల నుంచి 11.30 గంటల వరకూ సమావేశం నిర్వహణకు సంబంధించిన హడావిడేదీ కనపించకపోవడంతో కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు ఈ లోగా టీడీపీ శ్రేణులు కూడా ప్రధాన ద్వారం వద్దకు రావడంతో ఏం జరుగుతుందోనని తీవ్ర ఉత్కంఠ ఏర్పడింది. కలికిరి, పీలేరు సీఐలు రెడ్డిశేఖర్ రెడ్డి, యుగంధర్‌లు సిబ్బందిని పలుమార్లు అలర్ట్ చేయడం కనిపించింది. మరో వైపు వైసీపీకి చెందిన నేతలు మండల సమావేశానికి పోలీసు బందోబస్తు కల్పించాల్సిందిగా కోరినట్లు సమాచారం. మండలంలోని టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఎంపీపీతో సహా ఇతర సభ్యులు కార్యాలయంలోకి రావడానికి వెనుకంజ వేశారు. దీంతో వారు సెల్ ఫోన్లలో పోలీసు అధికారులతో సంప్రదింపులు జరిపారు. పోలీసులు ప్రధాన ద్వారం వద్ద మోహరించి చెందిన ఎంపీపీ, ఎంపీటీసీలు సరాసరిన లోనికి వెళ్ళడానికి వీలు కల్పించారు. అయినా ఉదయం 11.30 గంటలకు అధికారులందరూ సమావేశానికి సిద్ధంగా ఉన్నా ఎంపీపీ, ఇతర సభ్యులు రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో గంగయ్య ప్రకటించారు. ఎంపీపీతోపాటు ఇద్దరు మండల ఉపాధ్యక్షులు, 10 మంది ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యుడు ఎవ్వరూ హాజరుకానందువల్ల వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో మినిట్స్ నమోదు చేశారు. తదుపరి సమావేశాన్ని ఎంపీపీ నిర్ణయానుసారం తేదీని ప్రకటిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు. ఇద్దరు సీఐలతోపాటు, కలికిరి, పీలేరు పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. కాగా ఇదంతా సద్దుమణిగిన తరువాత మధ్యాహ్నం 12 గంటలకు ఒక ఎంపీటీసీతో కలిసి కొంతమంది అనుచరులతో ఎంపీపీ నూర్జహాన మండల పరిషత్తు కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీపీ కార్యాలయంలోకి వెళ్ళడానికి పోలీసులు సహకరించారు. అయితే అప్పటికే సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో తెలయజేయడంతో ఆమె కొంతసేపు అక్కడే ఉండి వెళ్లిపోయారు.


మండల పరిషత్ కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు, టీడీపీ శ్రేణులు, స్థానిక ప్రజలు

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


పోలీసు అధికారులకు సూచనలిస్తున్న జడ్జిలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 24: మదనపల్లె కోర్టు భవన సముదా యాల్లో సెప్టెంబర్ 14వ తేదీ నిర్వ హించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయసేవా అధికార సంస్థ ఛైర్మన్ ఎస్.రమేశ్ పిలుపునిచ్చారు. శనివా రం స్థానిక కోర్టులో పోలీసు అధికా రులు, న్యాయవాదులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, ప్రమాద కేసులు, ఆర్థిక లావాదేవీల కేసులు తదితరాలను ఇరువురు కక్షిదారులు చర్చించుకుని, సమ్మతంతో రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు, న్యాయవాదులు కృషిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లు నాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.విజయకుమార్‌రెడ్డి, డీఎస్పీ కొండయ్యనాయుడు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

మదనపల్లె టౌన్, ఆగస్టు 24: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వారి చేత సభ్యత్వ నమోదు చేయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఓ ప్రైవేటు కళ్యాణమండపంలో మూడు నియోజకవర్గాల బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదును డిజిటల్ పద్ధతిలో కూడా చేయవచ్చని, ముఖ్యంగా నిర్దేశించిన మొబైల్‌నెంబర్‌కు మిస్డ్‌కాల్ ద్వారా, లేకుంటే క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా సభ్యత్వ నమోదు చేయవచ్చన్నారు. సిద్ధాంతపరంగా ఉన్న బీజేపీని రాష్ట్రంలో ఉన్నత స్థానంలో నిలిపేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడాలని పిలుపు నిచ్చారు. గత ఎన్నికల్లో బీజేపీ రాజంపేట పార్లమెంట్ స్థానంలో అధిక ఓట్లు సాధించిదని, దీన్ని ఆసరాగా తీసుకుని ఎక్కువసంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, నంద్యాల ఇన్‌చార్జి పోతుగుంట రమేశ్‌నాయుడు, పి.సురేష్, చంద్రమౌళి, గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, ఓసూరి కిరణ్‌కుమార్, షబ్బీర్‌అహ్మద్, పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, భగవాన్, వేణు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సమస్యలపై రైతులకు అవగాహన


కందుకూరు గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏఈ ఉత్తన్న

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 24 : వ్యవసాయ విద్యుత్ సరఫరాపై రైతులు అవగాహన పెంచుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ ఉత్తన్న సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయానికి సంబంధించి ఏదైనా విద్యుత్ సమ స్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసు కురావాలని ఏఈ రైతులను కోరారు. మండలంలోని కందుకూరులో ఆయన రైతులతో మాట్లాడారు. గ్రామాల్లో విద్యుత్ లైన్లకు పిచ్చి మొక్కలు పేరుకుపోయి ఉంటే రైతులు మా దృష్టికి తీసుకొస్తే వాటిని తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించి ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో పొలాల వద్ద అడవి పందులకు విద్యుత్ తీగలు అమర్చు తుండడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నదని దీనిని దృష్టిలో ఉంచుకుని అటువంటి విద్యుత్ తీగలను అమర్చుతున్న వారిపై పిర్యాదు చేస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ సమస్యలపై ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకొస్తామన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 24: ఇంజనీరింగ్ విద్యార్థులు సబ్జెక్టుల వారీగా నైపుణ్యం మెరుగుపరుచుకోవాలని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆదిత్య కళాశాలలో నాలుగు రోజులుగా ఐబీఎం స్కిల్ బిల్డ్ బూట్ క్యాంపు, ఇడునెట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ సదస్సులు శనివారం ముగిసాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, సమన్వయకర్తలు షఫి, గంగాధర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించండి


రికార్డులు పరిశీలిస్తున్న ఆడిటర్ రుద్ర వెంకటసాయి

తంబళ్లపల్లె, ఆగస్టు 24: గ్రామ పంచాయతీలకు సంబంధించి రికార్డులను సక్రమంగా నిర్వహించుకోవాలని సీనియర్ ఆడిటర్ రుద్రవెంకటసాయి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పంచాయతీల జమా, ఖర్చులపై ఆడిట్ నిర్వహించారు. కోసువారిపల్లె, పంచాలమర్రి, ఎర్రసానిపల్లె, గోపిదిన్నె పంచాయతీల జమా, ఖర్చులపై ఆడిట్ చేశారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి ఆడిట్ నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరసింహులు, రఘు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు తప్పనిసరి

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 24 : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి, బ్రుసెల్లస్ వ్యాదులు రాకుండా రైతులు ముందుగా టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి రమేష్‌నాయక్ రైతులను కోరారు. మండలంలో పశువులకు గాలికుంటు బ్రుసెల్లస్ వ్యాదులను అరికట్టేందుకు ప్రభుత్వం ముందస్తుగా నివారణ చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న పశువైద్యశాలల్లో పశువులకు టీకాలు వేయించుకుని గాలికుంటు వ్యాధి, బ్రుసెల్లస్ వ్యాదుల నివారణను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. అదే విధంగా జాతీయ బ్రూసెలోసిస్ వ్యాది నిరోధక టీకాలు 4 మాసాల దూడలకు కూడా వేయించవచ్చని ఆయన పెర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతలు రూ.25 వేలు విరాళం


ఈవో మంజులకు చెక్కును అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ, ఆగస్టు 24:మండలంలోని చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయం పునర్నిర్మాణానికి దాతలు రూ.25,116 విరాళం అందజేశారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన నరసింహారెడ్డి దంపతులు రూ.25,116 నగదును ఈవో మంజులకు అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగించాలని కోరారు. దాతలకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పిం చి తీర్థప్రసాదాలను అందజేశారు.

పెద్దమండ్యంకు రెగ్యులర్ ఎస్ఐను నియమించండి

పెద్దమండ్యం, ఆగస్టు 24: పెద్దమండ్యం పోలీసు స్టేషన్‌లో రెగ్యులర్ ఎస్ఐని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు. గత రెండు నెలలుగా ఎస్ఐ లేక ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో రోజు రోజుకు అసాఘీక కార్యకలాపాలు పెరుగుతున్నాయి. మహిళలు మిస్సింగ్ కేసులు, ఇసుక అక్రమ రవాణ కేసులు నమోదుతోపాటు మండలంలో పట్టపగలే ఇళ్లల్లో దొంగలు చొరబడి నగదు, విలువైన బంగారు, వెండి ఆభరణాలు దోచుకుపోతున్నారు. పోలీసు స్టేషన్‌కు పలు సమస్యలతో వచ్చే ప్రజలకు ఎస్ఐ లేకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక వెనుదిరుగుతున్నారు. పెద్దమండ్యం పోలీసు స్టేషన్‌లో 29 పోలీసులకు గాను 5 మంది పోలీసులు మాత్రమే ఉన్నారు. జిల్లా ఎస్పీ చర్యలు తీసుకొని పెద్దమండ్యంకు రెగ్యులర్ ఎస్ఐని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గుండెపోటుతో టీడీపీ సీనియర్ నేత మృతి


సుబ్బారావు (ఫైల్‌ఫోటో)

పెద్దమండ్యం, ఆగస్టు 24: పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీ రెక్కలకొండపల్లికు చెందిన మండల టీడీపీ సీనియర్ నేత సుబ్బారావు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పెద్దమండ్యం లో గతంలో టీడీపీ ప్రధాన ప్రచార కార్యకర్తగా మండలంలో టీడీపీ బలోపేతం కోసం తన కృషి చేశారు. అయన మృతి పట్ల కూటమి నాయకులు, కార్యకర్తలు కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

● మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రుల ఆరోపణ

మదనపల్లె టౌన్, ఆగస్టు 24: మదనపల్లె పట్టణంలోని ఓ చిన్న పిల్లల ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం తీసుకొచ్చిన చిన్నారి మూడు గంటల్లోనే మృతి చెందడంతో, చిన్నారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ మృతి చెందాడని ఆరోపించారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం చేలూరుకు చెందిన శంకర, నీలమ్మ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నీలమ్మకు మూడో కాన్పులో మగబిడ్డ పుట్టాడు. ఈ బిడ్డకు ప్రణీత్ అని పేరుపెట్టి అల్లారుముద్దుగా పెంచుతున్నారు. కాగా ప్రణీత్‌కు నాలుగో నెల పడటంతో స్వల్ప అనారోగ్యానికి గురయ్యాడు. చేలూరులో వైద్యుల సలహా మేరకు ప్రణీత్‌ను శంకర, నీలమ్మలు మదనపల్లె పట్టణానికి తీసుకొచ్చారు. స్థానిక మార్పురివీధిలోని ఓ ప్రైవేటు చిన్నపిల్లల ఆస్పత్రిలో శనివారం సాయంత్రం 6గంటలకు చేర్చారు. ఇక్కడి వైద్యులు ప్రణీత్‌కు ఎక్స్‌రే పరీక్షలు చేయడంతో పాటు రక్తపరీక్షలకు రక్తసేకరణ చేశారు. ఇంతలో నీలమ్మ చెల్లెలు గౌతమి చేతిలో వున్న ప్రణీత్ ఉన్నట్టుండి కళ్లుతేలేసి మృతి చెందాడు. తమ బిడ్డను వైద్యులే ఏదో చేసేశారని శంకర, నీలమ్మలు బోరున విలపించారు. అక్కడే వున్న కొందరు డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చి జరిగిన సంఘటనపై బాధితులను, వైద్యుడిని విచారించారు.


బిడ్డ మృతి చెందడంతో బోరున విలపిస్తున్న శంకర, నీలమ్మ

జన్యులోపంతోనే అనారోగ్యం, మృతి

ఈ సందర్భంగా వైద్యుడు డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రణీత్ జన్యులోపాలతో పుట్టాడని, దీని వలన అనారోగ్యం పాలయ్యాడన్నారు. చేలూరు వైద్యుల సలహా మేరకు ఇక్కడికి తీసుకొచ్చారని, తాము ప్రణీత్‌కు వైద్యపరీక్షలు నిర్వహించామని, వ్యాధి నిర్ధారణ చేసేలోపలే చిన్నారి మృతి చెందాడన్నారు. ఇందులో తమ తప్పు లేదని స్పష్టం చేశారు. దీంతో చేసేదేమి లేక చిన్నారి మృతదేహాన్ని శంకర, నీలమ్మ స్వగ్రామానికి తీసుకెళ్లిపోయారు.

భక్తులతో కిటకిటలాడిన గెవితిమ్మరాయకొండ


స్వామి భక్తురాలు వీరమంగమ్మకు సారే సమర్పించి పూజలు చేస్తున్న వారసులు

రామసముద్రం, ఆగస్టు 24: మండలంలోని దిన్నెపల్లె సమీపంలో వెలసిన మహావిష్ణువు అవతార గెవితిమ్మరాయస్వామి ఆలయం శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. స్వామి దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. దీంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గుడి సమీపంలోని స్వామివారి భక్తురాలు వీరమంగమ్మ వారసులు ప్రముఖ గాయని డాక్టర్ వల్లాల శోభరాజ్ కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా వల్లాల వంశీయులు విశ్వనాథ్‌రాజు మాట్లాడుతూ తమ పూర్వీక వంశస్థురాలు వీరమంగమ్మ గెవితిమ్మరాయస్వామి వారికి పరమ భక్తురాలుగా ఉండేదని, ఆమె అత్తమామలు పెట్టే హింసను తట్టుకోలేక ఈ కొండ వద్దకు వచ్చిస్వామివారి పాదాల వద్ద క్షితి పేర్చి తన కడుపులోని బిడ్డతో సహా అగ్నికి ఆహుతి అయినట్లు తెలిపారు. ఆమె జ్ఞాపకార్థం ప్రతి ఏటా శ్రావణమాసంలో ఆమెకు పూజలు చేసి అన్నదానం నిర్వహిస్తామన్నారు.


భక్తులతో నిండిపోయిన ఆలయ క్యూలు


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988- 89లో చదివిన పూర్వ విద్యార్థులు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 24 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988- 89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 36 సంవత్సరాలు పూర్తి అ యిన సందర్భంగా శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో పాటు ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులం దరూ పలు ఉద్యోగాలు చేస్తూ ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. పాఠశాలలో వారు ఎదుర్కొన్న అనుభవాలను ప్రతి ఒక్కరు నెమరు వేసుకున్నారు. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులందరు కలిసి పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు మెదటి బహుమతిగా రూ 2500లు, ద్వీతీయ బహుమతిగా రూ.1500లు, తృతీయ బహుమతిగా రూ.1000లు విద్యార్థులకు అందించారు. పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్సిళ్లు, పెన్నులను అందచేశారు . ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వినోద్, కొట్టి బాస్కర్, సురేంద్రబాబు, నగేష్, మధు, మహేష్, నాగరాజు, నారాయణస్వామి, రమేష్, అంజమ్మ, నిషాన్‌బేగం, షాహీనాబేగం, నిర్మల తదతరులు పాల్గొన్నారు.

స్పందించకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదు

●ములకలచెరువు మార్కెట్ యార్డులో పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌పారం చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు

ములకలచెరువు, ఆగస్టు 24: ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రమాదం పొంచి ఉంది. సకాలంలో స్పందించకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. మార్కెట్ యార్డులోని ఓ మండీ ముందు ట్రాన్స్‌ఫార్మర్, చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయి. దీంతో రైతులు, వ్యాపారస్థులు, కూలీలు, వాహనాలతో నిత్యం కళకళలాడే మార్కెట్ యార్డులో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలు కనపడకపో వడంతో టమోటాలు తీసుకొచ్చే వాహనాలు వాటికి తగిలే అవకాశం ఉంది. ఈ విషయమై ట్రాన్స్ కో అధిరులకు ఎన్ని సార్లు విన్నవించినా ప్రయోజనం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు తక్షణం స్పందించి ఎలాంటి ప్రమాదం జరక్క ముందే ట్రాన్స్‌ఫార్మర్‌ను జన సంచారం లేని ప్రాంతంలో ఏర్పాటు చేసి చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

గుర్రంకొండ, ఆగస్టు 24:గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. ఉత్సవమూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

కలకడ, ఆగస్టు 24:మండలంలోని బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ శనివారం స్వామి వారికి విశేష పూజలను చేశారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అనంతరం నైవేధ్యం సమర్పించి అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీక రించారు.